తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
7 జూన్ 2026






# పొదుపు సూత్రం
# జీవన మంత్రం

# 'ఇరుముడి' ఆగస్టులో విడుదల?



మాస్ మహారాజ రవితేజ కథానాయకుడుగా నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా ఈ సంవత్సరం విడుదలై డీసెంట్ రన్‌ని చూసింది కానీ తన రేంజ్ హిట్‌గా అయితే నిలవలేదు.

ఇక దీని తర్వాత తాను చేస్తున్న సినిమా 'ఇరుముడి' చిత్రానికి మాత్రం సాలిడ్ బజ్ నెలకొంది.

అనౌన్స్‌మెంట్ నుంచే మంచి పాజిటివ్ వైబ్స్ సొంతం చేసుకున్న ఈ సినిమాని దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తుండగా ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది.

అయితే ఈ చిత్రం విడుదలకి సంబంధించిన తాజా సమాచారం వినిపిస్తోంది. దీని ప్రకారం మేకర్స్ ఆగస్టు నెలలో ఈ సినిమాని విడుదల చేయాలని చూస్తున్నట్టుగా తెలుస్తోంది. అప్పటికి సినిమా పనులు అన్నీ పూర్తయిపోయి కంటెంట్ రెడీ అవొచ్చని తెలుస్తోంది. సో.. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా ఇటీవలే "బంగారు పల్లకి సాంగ్ రీమిక్స్" షూట్‌ని కూడా పూర్తి చేసినట్టు సమాచారం. అలాగే ఈ చిత్రానికి ఎస్.ఎల్.వి. సినిమాస్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

తారాతీరం

# సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో మహేశ్‌బాబు!

సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పుడు లోకల్ నుంచి పాన్ ఇండియా కాకుండా డైరెక్ట్‌గా పాన్ వరల్డ్ లెవెల్ మార్కెట్, ఆడియన్స్‌ని తన భారీ సినిమా 'వారణాసి'తో ప్లాన్ చేసిన విషయం తెలిసిందే.

గ్లోబల్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో చేస్తున్న ఈ గ్లోబల్ ప్రాజెక్ట్ ఇప్పుడు శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఇక ఇలాంటి సినిమా తర్వాత మహేష్ నుంచి తరువాతి సినిమా ఏంటి? అందరిలో ఆసక్తి ఏర్పడింది.

ఇలాంటి గ్లోబల్ ఫినామినా తర్వాత దానిని మ్యాచ్ చేయగలిగే కాంబినేషన్‌ని సెట్ చేయడం అంటే అదో పెద్ద సవాలే అని చెప్పవచ్చు.

అయితే దీనికి సమాధానంగా మహేష్ కూడా ఊహించని ప్లానింగ్‌లోనే ఉన్నట్టు తెలుస్తోంది. తన తరువాతి ప్రాజెక్ట్ సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతోనే ఉంటుందనిని క్రేజీ బజ్ వినిపిస్తోంది. 'వారణాసి' లాంటి సినిమా తర్వాత ఆ వెయిట్‌ని క్యారీ చేయాలి అంటే కచ్చితంగా ఈ కలయిక వల్లే అవుతుంది. సో.. మహేష్ ప్లానింగ్ మాత్రం పర్‌ఫెక్ట్‌గా ఉందని చెప్పవచ్చు. అయితే ఇంతవరకు దీని గురించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.




ఆదివారం వార్త

7 జూన్, 2026

## మంచి ముత్యాలు

- నవ్వు లేని ముఖం నిరుపయోగమైన ముఖం. - మార్షల్
- చేతిలో వెన్నను భీకొట్టి మోచేయి నాకటం మూర్ఖం. - కొసరాజు
- బాధితులతో తాదాత్మ్యం చెందేవాడే మహర్షి. - సంత్ తుకారం

## కదంబం

'సంఘీ'భావం....5
తొలకరి జల్లుల మృగశిర కార్తె

కవర్ స్టోరీ..6
పొదుపు సూత్రం
జీవన మంత్రం

ఈ వారం కవిత్వం.. 11
నవ వసంతం అమ్మ

కథ..20
మూడో కన్ను

శ్రీ నరసింహుడు పాదం.. 27

వందేళ్లనాటి.. 29

ఇంకా...
మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## అతిపెద్ద రైల్వే స్టేషన్

ప్రపంచంలోనే అతిపెద్దదైన చైనాలో చాంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ నిర్మితమైంది. 40 డిగ్రీల ఎండ, కొండ ప్రాంతంలో కేవలం 38 నెలల రికార్డు కాలంలోనే చైనా ఈ అద్భుతాన్ని నిర్మించడం వెనుక ఒక పెద్ద రోబో విప్లవం దాగి ఉంది.

**రోబోల సైన్యం చేసిన మాయ:** ఈ భారీ ప్రాజెక్ట్ కోసం చైనా పెద్ద ఎత్తున రోబోల సైన్యాన్ని రంగంలోకి దింపినట్లు సమాచారం. లేజర్ సాయంతో నడిచే ఫోర్‌వీల్ రోబోలు మనుషుల కంటే మూడు రెట్లు వేగంగా, మిల్లీమీటర్ల కచ్చితత్వంతో కాంక్రీట్ లెవలింగ్ పనులను పూర్తి చేశాయి. ఏఐ, 5జీ సాంకేతికతతో పనిచేసిన ఈ రోబోల వల్ల కార్మిక ఖర్చులు 40 శాతం వరకు తగ్గినట్లు సమాచారం. సుమారు ఎనిమిది వందల కిలోల బరువైన భారీ గ్లాస్ ప్యానెళ్లను అమర్చడానికి ప్రత్యేక రోబోలను ఉపయోగించారట.

గతేడాది మే నెలలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ స్టేషన్ వైశాల్యం అక్షరాలా 1.22 మిలియన్ చదరపు మీటర్లు. ఇందులో 15 ప్లాట్‌ఫామ్‌లు, 29 రైల్వే ట్రాక్‌లు ఉన్నాయి. రద్దీ సమయాల్లో గంటకు 16 వేల మంది ప్రయాణికులను చేరవేసే సామర్థ్యం దీని సొంతం. ఈ ఒక్క స్టేషన్ నుంచి చైనాలోని బీజింగ్, షాంఘై వంటి 14 ప్రధాన నగరాలకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఉంది.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## ఎదురు చెప్పలేను!

"ఇలా మధ్యలో నా కేసు వదిలేస్తే ఎలాగండి?" క్లైంట్ లాయరును ప్రాధేయపడుతున్నాడు.



"నేనేం చేసేదయ్యా? నాకు నీ కేసు వాదించాలనే ఉంది కానీ ఎక్స్‌పార్టీ కేసును మా ఆవిడ తీసుకుంది. ఆవిడకు నేనే ఇంట్లోనే కాదు, కోర్టులోనూ ఎదురు వాదించలేను" అన్నాడు ఆ లాయర్.

ఇక ఏం మాట్లాడతాడు క్లైంట్.

## జీవితఖైదు

"సార్, ఇతను నా మనసు దొంగిలించాడు. జీవితఖైదు విధించండి" అన్నది ఓ యువతి బోనులో వున్న యువకుణ్ణి చూపిస్తూ.

"అలాగేనమ్మా! అతనితో నీకు పెళ్లి జరిపిస్తాను. అంతకన్నా పెద్ద జీవితఖైదు శిక్షణ ఇంకొకటి లేదు" అని తీర్పు ఇచ్చాడు, జడ్జి.

ఆ యువకుడి వెయ్యి ఒల్లుల బల్లుబలా వెలిగిపోయింది.

**– టి.సదాశివరెడ్డి,** తిరుపతి

## సీరియల్

జీడిపాకం సీరియల్ ముగిసింది. దాంతో ప్రసిద్ధ తలనొప్పి నివారణ బామ్ షేర్లు ఒక్కసారిగా పాతాళానికి పడిపోయాయి. కారణం జీడిపాకం సీరియల్ వల్ల తలనొప్పి బాధితులు వేలకు వేలు పెరిగిపోయారు. తలనొప్పి తగ్గడానికి లక్షల్లో అమ్మకాలు పెరిగిపోయాయి.

## చైనా పర్యటన

"హలో, నేను సుబ్బారావును మాట్లాడుతున్నాను, ఫలానా కంపెనీ షేర్ కొనుక్కోవచ్చా?" అని అడిగాడు, టీవీ యాంకర్‌ను.

టీవీ యాంకర్ అంది "భేషుగ్గా కొనుక్కోవచ్చు".

"కానీ నేను మూడు రోజుల క్రితం ఇదే కార్యక్రమంలో మీతో మాట్లాడాను. అప్పుడు వద్దు అన్నారు. ఇప్పుడేమో కొనుక్కోవచ్చు అంటున్నారు" సందేహం అడిగాడు.

"నాయనా, సుబ్బారావు, అప్పుడు ట్రంప్ అమెరికాలో ఉన్నాడు, కానీ ఇప్పుడు అతను చైనా పర్యటనలో ఉన్నాడు. అదీ తేడా!" సమాధానమిచ్చాడు టీవీ యాంకర్.

## పొదుపు

ఇద్దరు మందు బాబులు మాట్లాడుకుంటున్నారు.

మొదటివాడు "ప్రభుత్వాలు పొదుపు పాటించండి.. అని చెబుతున్నాయి, అందుకే ఇంట్లో కూర్చుని తాగుదామని అనుకుంటున్నాను. అలా అయితే ఇంధనం ఆదా చేసినట్లే, కదా!" అన్నాడు.

"నేను కూడా నీ బాటలోనే, బంగారం.. బీర్‌కు బదులుగా కాస్త ధర తక్కువున్న మందు కొందామని డిసైడ్ అయ్యాను. అయితే ఇంట్లో తాగడం కష్టం. అందుకే ఎలెక్ట్రిక్ బైక్ మీద ఒకరితో వస్తాను, తాగిన తర్వాత అతనే ఇంట్లో దిపుతాడు" అన్నాడు రెండోవాడు.

**– కె.లహరి,** కరీంనగర్




## కక్కుర్తి వల్ల..

"నువ్వు దొంగతనం చేసిన దుకాణంలోనే రాత్రంతా నిద్రపోయి ఉదయం దుకాణం వాళ్లకు దొరికావు.. రాత్రే బయటకు ఎందుకు వెళ్లలేదు?" అడిగాడు జడ్జి దొంగను.

"నేను దొంగతనానికి వెళ్ళింది మద్యం షాపులో. డబ్బులు కొట్టేసాక కొత్తరకం బ్రాండ్ బాటిల్ కనిపించి కక్కుర్తి పడి తాగి అక్కడే పడుకుండి పోయాను" బదులిచ్చాడు దొంగోడు.

**–ఎస్.కె.యాకూబ్ పాషా,** ఖమ్మం

## హాల్‌టికెట్

"నువ్వు పరీక్షల్లో పాసవ్వాలని మొక్కుకున్నావు కదా! హుండీలో డబ్బులతో పాటు ఇంకో చీటీ వేసావేంటి?" అడిగాడు అర్చకుడు.

"ఆ చీటీ మీద నా హాల్ టికెట్ నంబర్ రాసాను" తెలివిగా బదులిచ్చాడు విద్యార్థి.

## ఎలా రాయాలి?

టీచర్: "పర్యావరణం మీద వ్యాసం రాయి" అంది.

స్టూడెంట్: "పేపర్ మీద పెన్‌తో రాయవచ్చు.. కానీ పర్యావరణం మీద దేంతో రాయాలి?" గడుసుగా బదులిచ్చింది, విద్యార్థి.

# 'సంఘీ' భావం



# తొలకరి జల్లుల మృగశిర కార్తె

ఎండవేడిమి, వడగాడ్పుల సెగలతో సతమతం అవుతున్న జీవరాశికి, మానవులకు ఆహ్లాదాన్ని కలిగించేదే మృగశిరకార్తె. ఈ మృగశిరకార్తె ప్రారంభమైన తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కనిపిస్తుంది. రుతుపవనాలు అప్పటికే ప్రవేశించినప్పటికీ ప్రధానమైన వాతావరణ మార్పులు ఇక్కడి నుంచే ప్రారంభం అవుతాయి. ఎండల వేడిమితో బీడుగా మారిన భూములకు తొలకరి జల్లులతో జవసత్వాలను కలిగిస్తుంది. జూన్ 8వ తేదీ నుంచి మృగశిర కార్తె ప్రారంభం కానుంది. అశ్విని మొదలుకుని రేవతి వరకూ 27 నక్షత్రాల్లో సూర్యుడి ప్రవేశం ఆధారంగా కార్తె నిర్ణయం, కార్తెలను గుర్తిస్తారు. భారతీయ జ్యోతిష సాంప్రదాయం ప్రకారం.. ఒక్కో కార్తెలో ఒక్కో విధంగా ప్రకృతిలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించిన నాటినుంచి నైరుతి రుతుపవనాలు వస్తాయి. వాతావరణం ఒక్కసారిటీ చల్లబడటం, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలతో సతమతమవుతుంటారు. మృగశిర కార్తెలో వచ్చే నైరుతి రుతుపవనాలతో వాతావరణం చల్లబడి ఉపశమనం కలుగుతుంది. మృగశిర కార్తెను రైతులు ఏరువాక సాగే కాలం అని కూడా ఉంటుంటారు. ఈ కాలంలో రుతుపవనాలు విస్తరించి తొలకరి వర్షాలు పడగానే రైతులు పొలాన్ని దున్ని పంటలు వేయడం ప్రారంభిస్తారు. మిగిలిన కార్తెల కంటే మృగశిర కార్తె అనేక ప్రత్యేకతలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా భూమికి, పంటలకు, పర్యావరణానికి హితంగా ఉండటంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా అవకాశం కలిగిస్తుంది. ఈ కార్తె మొదటి రోజును దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మృగశిర, మృగం, మిరుగు, మిర్గం అనే పేర్లతో పిలుస్తారు. ఈ రోజు ప్రజలు బెల్లంలో ఇంగువ కలుపుకొని తింటారు. ఇది శరీరంలో ఉష్ణోగ్రత ప్రేరేపించి వర్షాకాలంలో సోకే వ్యాధులను అడ్డుకుంటుందని నమ్మకం. అంతేకాదు.. ఈ కార్తె రోజు చేపలను తప్పనిసరిగా తింటారు. మృగశిర కార్తెనాడు చేపలు తినడాన్ని మన పూర్వీకుల నుంచి అనాదిగా వస్తోంది. ఎండకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీంతో వేడి ఉండేందుకు చేపలను తింటారు. దీని వల్ల గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా ఈ కార్తె రావడంతో వర్షాలు మొదలు కానున్న నేపథ్యంలో అంటువ్యాధులు ఒక్కసారిగా ప్రబలుతాయి. ఈ సీజన్‌లో చాలా మందికి జీర్ణశక్తితో పాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం, దగ్గు, ఇతర వ్యాధుల బారిన పడుతుంటారు. ఇలాంటి నుంచి గట్టెక్కాలంటే చేపలు తినడం వల్ల ప్రయోజనం ఉంటుందని వైద్యులు సైతం చెబుతుంటారు. హైదరాబాద్‌లో చేపమందును ఆరోజు ఇస్తుంటారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా ఆస్తమా వ్యాధిగ్రస్తులు హైదరాబాద్ చేరుకుంటారు. గతంలో ఉత్తరాది నుంచి ప్రత్యేక రైళ్లను కూడా నడిపేవారు. హైదరాబాద్‌లో చేపమందు కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తారు. దీనికి అవసరమైన చేపలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మృగశిరకార్తె నాడు ఈ మందు సేవిస్తే ఆస్తమా నుంచి ఉపశమనం ఉంటుందని భావిస్తారు. దీనితో వేలాది మంది చేపమందు కోసం హైదరాబాద్ చేరుకుంటారు. మాంసాహారులు చేపలతో పాటు కోళ్లు, పొటేళ్లు, మేకపోతులు వంటి వాటిని కూడా భుజిస్తారు. కోడి మాంసం వేడిని సృష్టిస్తుంది. దీనివల్ల బయట వాతావరణ చల్లగా ఉన్నప్పటికీ శరీరం వేడిని కలిగి ఉంటుంది. చాలా ప్రాంతాల్లో చేపలను చింతచిగురు, ఇంగువలను జోడించి భుజిస్తారు. పల్లెల్లో పండుగ వాతావరణం ఉంటుంది. మృగకార్తె రాకతో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడం ప్రారంభమౌతాయి. రైతాంగం తమ వద్ద ఉన్న ఎద్దులకు పూజలు నిర్వహిస్తారు. పంట చేల వద్ద పూజలు చేసి పొలం పనులు ప్రారంభిస్తారు. ఎండల వేడిమికి బీడువారిన చేలను దుక్కిదున్ని పంటలకు సిద్ధం చేస్తారు. దీనితో అటు రైతులకు, ఇటు వ్యవసాయ కూలీలకు చేతినిండా పని ఉంటుంది. తెల్లవారుజామునే చేలకు చేరుకుని పనులను ప్రారంభిస్తారు. వర్షాలు కురవడంతో జీవరాశులు కూడా ఉత్తేజం అవుతాయి. చెట్లు చిగురించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయి. దీనితో మృగశిరకార్తెకు పురాణ గాథలతో పాటు వాస్తవికతకు కూడా దగ్గరగా ఉండటంతో ఆనందంగా ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

# పొదుపు సూత్రం జీవన మంత్రం

సుంకవల్లి సత్తిరాజు

భానుడు భూతలాన్ని భగభగమండిస్తుంటే, మండే ఎండలతో పాటు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు జన జీవితాల్లో పెను మంటలు సృష్టిస్తున్నాయి. అమెరికా ఇజ్రాయిల్ దురహంకారంతో మధ్య ప్రాచ్యంలో చెలరేగిన యుద్ధ జ్వాలలు ప్రపంచాన్ని ఇంధనం లేకుండానే మండిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి మన దేశం ప్రణాళిక బద్ధమైన కార్యాచరణతో ముందుకు సాగాలి. తనకున్న సంపాదనతో సంతృప్తి చెందుతూ, తినీ తినక ఉన్నదాంట్లో కాస్తో, కూస్తో భవిష్య అవసరాలకోసం దాచి పెట్టుకుంటూ గుట్టుగా జీవిత నావను నెట్టుకురావడం భారతీయ జీవిత విధానంలోని ప్రత్యేకత. ఆదాయాన్ని, ఖర్చును అంచనా వేసుకుంటూ భవిష్య భద్రతకు చోటు కల్పించడాన్ని 'పొదుపు' అని స్థూలంగా చెప్పవచ్చు. నేటి పొదుపు రేపటి భద్రత. ఎంత సంపద ఉన్నా, దుబారా ఖర్చులు చేస్తూ పోతే చివరకు మిగిలేదేమీ ఉండదు. ఆరోగ్యంగా ఉన్నప్పుడు కూడబెట్టు కోకపోతే, అనారోగ్యం దరి చేరిననాడు కష్ట పడాలనే సంకల్పం ఉన్నా, ఫలితం శూన్యం. ఇది జగమెరిగిన సత్యం.

ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే ఒడలైనా బండ్లు కాక తప్పవు. ఇది ప్రతీ వ్యక్తి జీవితానికి అన్వయింపబడే వాస్తవం. కాబట్టి పొదుపు జీవితానికి అత్యవసరం. పొదుపు సూత్రాలను పాటించి ఆర్థిక క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా జీవితాలను కొనసాగించడం అవసరం. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి అల్పాదాయ వర్గాల వారు తగు జాగరూకత పాటించాలి. 'ఉన్ననాడు తెలివి కలిగి పొదుపు చేయరా, లేనినాడు ఒడలు వంచి కూడబెట్టరా' పాత సినీ గేయం పొదుపుపై వెలువడ్డ చక్కని సందేశం ప్రజాబాహుళ్యానికి చేరువ చేసింది. అయితే తరాలు మారుతున్నాయి. తరాల మధ్య అంతరాలు పెరిగిపోయాయి. నాటి ఆలోచనలు, సందేశాలు నేటి తరానికి బరువుగా మారిపోతున్నాయి. నాటి మాటలను నేటి తరం చాదస్తంగా కొట్టి పారేయడం చూస్తున్నాం. ఈరోజే వాస్తవంగా, రేపటి రోజు ఊహగా భావిస్తూ, భవిష్యత్తును పట్టించుకోకుండా విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ, రేపటిని ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్న వారికి మంచి మాటలు చెవికెక్కవు. ప్రధాని హఠాత్తుగా ప్రజలకు పొదుపు గురించి చెప్పడంలో గల ఆంతర్యమేమిటో అర్థంకాక చాలా మంది తలలు పట్టుకుంటున్నారు. మేధావులు, ఆర్థిక విశ్లేషకులు, సామాన్య ప్రజలు ప్రధాని మోడీ సందేశం వెనుక దాగిన వాస్తవాన్ని ఛేధించడానికి యత్నిస్తూ, ఎవరికి తోచిన రీతిలో వారు ప్రధాని ప్రసంగానికి తమదైన శైలిలో భాష్యం చెబుతున్నారు.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ దేశాలన్నీ ఇంధన కొరతతో అతలాకుతలమైపోతున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ముగింపు విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. మిడిల్ ఈస్ట్‌లో చెలరేగిన యుద్ధ జ్వాలలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలను కకావికలం చేస్తున్నాయి. ఇంధన కొరత ప్రపంచ దేశాలతో పాటు భారత్‌ను కూడా కలవరపెడుతున్నది. క్యూబాలో రోజుకు 2 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతున్నది. చమురు నుండి విద్యుత్‌ను తయారు చేయడమే ఇందుకు కారణం.

భారత్‌లో గృహావసరాలకు సరిపడా గ్యాస్ లభ్యం కాకపోవడంతో ఇప్పటికే అనేక మంది ఇండక్షన్ స్టవ్‌లను ఆశ్రయిస్తున్నారు. టిఫిన్ సెంటర్లు, హోటళ్ళు కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నాయి. గ్యాస్ కంపెనీలు కొత్త గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం లేదు. గ్యాస్ వినియోగదారులపై విధించిన పరిమితుల వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్రోల్, డీసెల్ ధరలు రెండు సార్లు పెంచడం జరిగింది. స్వయంగా ప్రధాని తన కాన్వాయ్‌ని తగ్గించుకోవడం, వర్చువల్ మీటింగులు, వర్క్ ఫ్రమ్ హోంకు ప్రాధాన్యతనివ్వాలని చెప్పడం, బంగారం దిగుమతులపై భారీగా కస్టమ్ సుంకం పెంచడం లాంటి చర్యలు ముసురుకుంటున్న..



ఆర్థిక సంక్షోభ ఛాయలకు సూచనగా భావించవచ్చు. బంగారం కొనవద్దని, పొదుపు పాటించాలని, ఇంధన వినియోగం తగ్గించాలని చెప్పడం..ప్రధాని చేసిన ప్రకటన ప్రజల్లో ఆర్థిక క్రమశిక్షణ నెలకొల్పడానికి ఉద్దేశించినదే అయినా ఈ ప్రకటన ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించింది. బంగారం కొనడం తగ్గించాలని చెప్పడమే కాకుండా బంగారంపై దిగుమతి సుంకాలను పెంచడం, వెండి దిగుమతులను నిషేధించడం జరిగింది.

## ఆయిల్ కంపెనీల ఆరాటం ప్రజలతో చెలగాటం

ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తుంటే 1991 నాటి ఆర్థిక సంక్షోభం భారత్‌లో పునరావృతం కానుందా అనే అనుమానాలు మొదలైనాయి.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడంతో భారతీయ ఆయిల్ కంపెనీలు, ఎల్పీజీ, పెట్రోల్, డీసెల్ ధరలను పెంచడం జరిగింది. పెట్రోల్, డీసెల్‌పై లీటర్‌కు రూ.25 నష్టం వాటిల్లుతున్న దృష్ట్యా, ప్రతీ రోజు సుమారు 1400 కోట్ల నష్టం భరించవలసి వస్తున్నదని, ఈ కారణంగా పెట్రోల్, డీసెల్‌పై లీటర్‌కు 25 రూ॥ పెంచాలని ఆయిల్ కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి.

## భారత్‌లో ఆర్థిక సంక్షోభమా?

భారత్‌లో కొద్ది రోజుల్లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తలెత్తనుందని, ఇది లాక్ డౌన్ లాంటి పరిస్థితులను తలపించినా ఆశ్చర్యపోనక్కరలేదని ఆర్థిక నిపుణుల అంచనా. రోడ్లన్నీ నిర్మానుష్యమౌతాయని, వాహనాలకు వారంలో ఒక రోజు హాలిడే ప్రకటిస్తారని, ధరలు భారీగా పెరుగుతాయని వెలువడుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. బ్యాంకుల్లో తగిన నగదు నిల్వలు లేకపోవడం, ప్రజలు నగదు కోసం బ్యాంకుల చుట్టూ తిరగడం దేనికి సంకేతం? నగదు దగ్గర పెట్టుకోవాలంటూ వెలువడుతున్న వార్తల్లో నిజమెంత? డిజిటల్ ట్రాన్సాక్షన్లు ఉండగా నగదు దగ్గరుంచుకోవాలని చెప్పడమెందుకు? అసలు ఏం జరగబోతుంది? గతంలో గల్ఫ్ యుద్ధ సమయంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నది. అప్పుల భారం పెరిగింది. అప్పులపై వడ్డీలు చెల్లించే పరిస్థితుల్లో దేశం లేదు. ద్రవ్యోల్బణం పెరిగింది. చమురు ధరలు ఆకాశాన్నంటాయి.

అలాంటి సమయంలో ప్రైవేటు రంగాన్ని తెరపైకి వచ్చింది. దిగుమతులను తగ్గించడం, ఆర్థిక సంస్కరణల్లో భాగంగా లైసెన్సుల మంజూరీ ప్రక్రియను సరళతరం చేయడం జరిగింది. పి.వి.నరసింహారావు ఆర్థిక సంస్కరణలు, మన్మోహన్ సింగ్ ఆర్థిక నైపుణ్యం అప్పట్లో దేశాన్ని ఆర్థిక గడ్డు పరిస్థితుల నుండి గట్టెక్కించడానికి దోహదం చేసింది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశం మంచి అభివృద్ధి రేటును సాధించింది. ఆ తర్వాత వచ్చిన మోడీ ప్రభుత్వం కూడా భారత్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. దేశాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మార్చడం జరిగింది. కోవిడ్ సంక్షోభం తర్వాత ఇప్పుడు తలెత్తిన ఇరాన్ అమెరికా యుద్ధం తిరిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బ తీసింది. ఇలాంటి పరిస్థితుల



నుండి గట్టెక్కించడానికి ప్రధాని మోడీ పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగమే పొదుపు మంత్రం.

## చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థలు

ఇంధన సంక్షోభంతో పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైపోతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు అందనంత ఎత్తులో ఉన్నాయి. ప్రపంచంలోని సంపన్న దేశాల్లో ఒకటైన చిన్న ద్వీపకల్ప దేశం ఖతార్ యుద్ధం వలన చిన్నాభిన్నమైనది. ఖతార్ ఆదాయంలో అత్యధిక భాగం ఎల్ఎన్జీ సంబంధిత ఎగుమతుల ద్వారానే లభిస్తున్నది. విమానాల ద్వారా ఆహారం రప్పించడం వలన ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. ఖతార్ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనది. అమెరికా లాంటి దేశాల్లో కూడా ఇంధన ధరలు భారీగా పెరిగాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి పలు దేశాల్లో ఇంధన ధరలు ప్రజలు మోయలేని స్థితిలో ఉన్నాయి. ఇతర దేశాలతో పోల్చి చూస్తే భారత్‌లో ఇప్పటి వరకు ప్రజలపై పెద్దగా భారం పడలేదనే చెప్పాలి.వాణిజ్య సంబంధమైన గ్యాస్ ధరలు భారీగా పెరిగినా అవి ఇతర దేశాలతో పోల్చి చూస్తే తక్కువే అయినా ఒకేసారి ఇంత భారం పడడం చిన్న హోటళ్ళు, టిఫిన్ సెంటర్లు, క్రీ పాయింట్లపై శరాఘాతమే అని చెప్పక తప్పదు. రష్యా-ఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న సుదీర్ఘమైన యుద్ధం వలన ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యానికి గురైనా, భారత్ ఆర్థిక వ్యవస్థ మాత్రం పుంజుకుని నాలుగో ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. అయితే మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం వలన హార్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన ఉద్రిక్తతల వలన, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా దిగ్బంధనం చేయడం వలన భారత్‌కు చమురు దిగుమతులు నిలిచిపోవడం, ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడంతో ఆయిల్ కంపెనీలకు నష్ట వాటిల్లడం జరుగుతున్న మాట వాస్తవమే. గతంలోనే వంట గ్యాస్ ధరలను, వాణిజ్య సిలండర్ల ధరలను భారీగా పెంచడం వలన కట్టెల పొయ్యిలే ప్రస్తుతం దిక్కయ్యాయి.

## పొదుపు సూత్రాలు అందరికీ వర్తించాలి

ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్‌లో ఏర్పడిన ఇంధన కొరత ఆర్థిక సంక్షోభానికి దారితీసే అవకాశాలు

ఉండటంతో, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలంటూ వెలువడుతున్న సంకేతాలు దేనికి సంకేతం? ప్రజల వైపు నుండే కాకుండా ప్రభుత్వాల వెపు నుండి, ప్రజా ప్రతినిధుల నుండి ఈ ఆర్థిక క్రమశిక్షణ అలవడాలి. సాంప్రదాయ ఇంధన వనరుల వాడకం తగ్గించాలి. సౌర విద్యుత్తును ప్రజలకు కారు చౌకగా అందించే ఏర్పాట్లు చేయాలి. ఎలక్ట్రానిక్ వాహనాల ధరలను తగ్గించి, మధ్య తరగతి వారికి అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వాలు చెబుతున్న పొదుపు చర్యల వలన ఇతరుల ఉపాధికి భంగకరం కారాదు.

## దేశంలో ఆర్థిక సంక్షోభ సమయం ఉత్పన్నమైతే!

1991లో భారత్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్నది. దేశం అంతర్జాతీయంగాను,అంతర్గతంగాను ఎన్నో ఒడిదుడుకులకు లోనైనది. 1991-96 వరకు భారత ప్రధానిగా మైనారిటీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చాకచక్యంగా నడిపిన పి.వి.నరసింహారావు సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని ఆర్థిక క్లిష్ట పరిస్థితుల నుండి గట్టెకించారు. తాకట్టు పెట్టిన సుమారు 47 టన్నుల బంగారాన్ని విడిపించడమే కాకుండా విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంచి, దేశాన్ని ముందుకు నడిపించారు. పి.వి ఆర్థిక సంస్కరణలను తరువాత వచ్చిన కేంద్ర ప్రభుత్వాలు కొనసాగించాయి. మన్మోహన్ సింగ్, వాజ్‌పేయి ప్రభుత్వాలు భారత్‌ను ప్రగతి పథంలో నడిపించడానికి విశేష కృషి చేసారు. మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తున్నది. దేశాభివృద్ధిలో తనదైన శైలి ప్రదర్శిస్తున్నది. అయితే రెండేళ్ల కోవిడ్ సమయంలో దేశం అనేక ఒడిదుడుకులకు లోనై నిలబడింది. కోవిడ్ నాటి అస్తవ్యస్థ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు ప్రస్తుతం ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వ ప్రకటనల వలన స్పష్టమవుతున్నది. దేశ ప్రజలంతా నాటి క్లిష్ట పరిస్థితులను ఎలా అధిగమించగలిగారో, అలాగే ఇరాన్ అమెరికా యుద్ధం వలన ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని పొదుపు చర్యల ద్వారా అధిగమించాలని ప్రధాని సూచిస్తున్నారు. ఇప్పటికే టిఫిన్ సెంటర్లు, కొన్ని హోటళ్ళు గ్యాస్ కొరతతో మూతబడ్డాయి. 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలండర్ ధర మూడు వేల రూపాయలను దాటిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజలు టీ,టిఫిన్‌లకు దూరమైపోతున్నారు. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా పెరిగిపోయాయి. అవి కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. అల్పాదాయ వర్గాల ప్రజలు కట్టెల పొయ్యిలతో కాలం వెళ్ళదీసే పరిస్థితులు ఉత్పన్నం కావడం బాధాకరం. ఇప్పటికే పెరిగిన ఇంధన ధరలతో, నిత్యావసర వస్తువుల ధరలతో మధ్య,దిగువ మధ్య తరగతి ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న వేతన జీవుల సంగతి మరీ దుర్భరంగా ఉంది. ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉన్న నేపథ్యంలో, చాలీ చాలని సంపాదనతో నెట్టుకొస్తున్నవారు ఇంకా ఎలాంటి పొదుపు చర్యలు పాటించాలో అవగతం కావడం లేదు. ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, తప్పనిసరి ఖర్చులు ఉండనే ఉంటాయి.నిత్యావసర వస్తువులు, పిల్లల చదువులకు, ఆరోగ్యానికి అప్పులు చేసైనా ఖర్చు చేయక తప్పదు. నిరుపేదల ముంగిట పొదుపు అనే మాట ప్రస్తావించడం విడ్డూరమే. ధనికులు అనవసరమైన విలాసాలను విందులు, వినోద కార్యక్రమాలను తగ్గించుకోవాలి. కేంద్రం విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంచడానికి తీవ్రంగా కృషి చేయాలి. దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించాలి.



## కోవిడ్ తరహా పరిస్థితులు ఏర్పడతాయా?

2019 డిసెంబర్‌లో మొదలైన కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన విలయాన్ని తలచుకుంటుంటే నేటికీ గగుర్పాటు కలిగించక మానదు. కోవిడ్19 వలన కోట్లాది మంది ప్రజలు మృత్యు తీరాలకు చేరిన వాస్తవం. నేటికీ మన కళ్ళెదుట ఒక విషాద దృశ్యంగా అగుపిస్తూ, నాటి విపత్తు హృదయాన్ని స్పృశించక మానదు. కోవిడ్ విలయంతో ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోతే, మరెన్నో జీవితాలు ఆర్థికంగా తల్లక్రిందులై పోయాయి. తిండి లేక ఎంతో మంది అలమటించిపోయారు. కోవిడ్ సమయంలో ఉపాధి లేక రోడ్డున పడ్డవారు ఎంతగా విలపించారో ఆ దృశ్యాలింకా మన స్మృతి పథం నుండి తొలగిపోలేదు. విద్యాలయాలు మూతబడ్డాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. హోటళ్ళు, రెస్టారెంట్లు, చిన్న చిన్న టిఫిన్ సెంటర్లు కూడా మూతబడడంతో ప్రజలు ఆకలి కేకలు మిన్నంటాయి. రోడ్లు, భవన నిర్మాణ కార్మికులు, కూలీలు ఉపాధి లేక అలమటించారు. విద్యార్థుల చదువులు అటకెక్కాయి. నిత్యావసర వస్తువులు దొరక్క ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం. నాటి లాక్ డౌన్ ప్రజా జీవితాన్ని అస్తవ్యస్థం చేసింది. నగర జీవనం స్థంభించిపోయింది.

ఎల్లప్పుడూ సందడిగా ఉండే పల్లెల్లో కూడా కోవిడ్ వలన స్తబ్దత ఆవహించింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సంశయంలో పడ్డారు. ఈ సంక్షోభమే ఎన్నో ప్రశ్నలకు జవాబులను అందించింది. క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఎలా చేయాలో నేర్పించింది. ఈ సంక్షోభమే ఎన్నో అవకాశాలకు మార్గం నిర్దేశించింది. ఆన్ లైన్ మీటింగులకు, వర్చువల్..

పద్ధతులకు ఆలంబనగా మారింది.' వర్క్ ఫ్రమ్ హోం'కు అంకురార్పణ జరిగింది. రెండేళ్లు కొనసాగిన కోవిడ్ సంక్షోభం వలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అతలాకుతమై పోయాయి. రెండేళ్ల తర్వాత జనజీవన పయనం సాధారణ స్థితికి వచ్చినా, ఆ తర్వాత తలెత్తిన రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం వైపు నడిపించింది. ప్రపంచమంతా ఆర్థికంగా అతలాకుతలమైనా రష్యాతో మనకు గల చిరకాల స్నేహ బంధం వల్ల చమురు పుష్కలంగా లభించడంతో భారత్ ఆర్థికంగా బలమైన దేశాల్లో ఒకటిగా మారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టడానికి ప్రయత్నించడం జరిగింది. రష్యా వద్ద చమురు కొనుగోలు చేయకుండా భారత్‌ను కట్టడి చేసాడు. సరిగ్గా ఇదే సమయంలో పులి మీద పుట్రలా, పుండు మీద కారం చల్లినట్టుగా ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఖరీదైన అమెరికా యుద్ధ విమానాలు, క్షిపణులు అధునాతన ఆయుధాలు తక్కువ ఖర్చుతో తయారైన ఇరాన్ డ్రోన్ల ముందు కొరగాకుండా పోయాయి. ఐఆర్‌జిసి గెరిల్లా తరహా యుద్ధ వ్యూహాల ముందు అమెరికా అపజయం పాలైనది. అయితే ఈ ఓటమిని అంగీకరించలేని ట్రంప్ అహం దెబ్బతిన్నది. యుద్ధాన్ని అమెరికా ప్రారంభించినా, యుద్ధ విరమణ తన చేతుల్లోనే ఉందని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్, ఒమన్ ప్రాదేశిక జలాల్లో ఉన్న హార్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యం చెలాయించడం కారణంగా ప్రస్తుతం ఇరాన్ ఈ జలసంధిని అడ్డుపెట్టుకుని ప్రపంచ దేశాల చమురు వాణిజ్యానికి విఘాతం కలిగిస్తున్నదని అమెరికా ఆరోపిస్తున్నది. అయితే తాము యుద్ధానికి ముందు కూడా హార్ముజ్‌లో రవాణా నౌకలకు ఆటంకం కలిగించలేదని, అమెరికా కారణంగానే ప్రస్తుత సమస్య ఏర్పడిందని ఇరాన్ ఆరోపిస్తున్నది. ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధించి, అమెరికా సమస్యను మరింత జటిలం చేసింది. ఈ కారణంగానే ప్రపంచంలో ఇంధన సమస్య తలెత్తింది. ప్రపంచం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయింది.

భారతదేశం కూడా ఇందుకు మినహాయింపు కాదు. రూపాయి విలువ క్షీణించడం ప్రారంభమైనది. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల వరకు పరిస్థితి సవ్యంగా ఉన్నట్టు కనిపించినా ఎన్నికల తర్వాత దేశ ఆర్థిక ముఖచిత్రం స్థూలంగా దృగ్గోచరమైనది. ప్రధాని మోడీ ప్రకటనతో ప్రజల్లో ఆందోళన ఏర్పడింది. ఏం జరగబోతుందో అర్థం కాని సందిగ్ధత నెలకొంది.



## క్షీణిస్తున్న రూపాయి..

ప్రస్తుత ఆర్థిక సంక్షోభ సమయంలోను అమెరికా 32.38 ట్రిలియన్ డాలర్ల జిడిపితో, చైనా 20.85 ట్రిలియన్ డాలర్ల జిడిపితో ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉండగా, ఇప్పటివరకు 4వ బలమైన ఆర్థిక వ్యవస్థగా కొనసాగిన భారత్ ఇటీవల చోటుచేసుకున్న ప్రపంచ పరిణామాలతో ఆరవ స్థానానికి పడిపోయింది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో గత కొద్ది సంవత్సరాలుగా అతలాకుతలమైన యు.కె. కూడా భారత్‌ను అధిగమించి, ఐదవ స్థానం ఆక్రమించింది. భారత్ 4.15 ట్రిలియన్ డాలర్ల జిడిపితో జర్మనీ, జపాన్, యు.కెల కంటే వెనకబడి ఉండడం గమనార్హం. భారత్ సుమారు 700 బిలియన్ డాలర్ల విదేశీ దిగుమతులు చేసుకోవడం వలన, భారతదేశ సంపద విదేశాలకు తరలిపోతున్నది. డాలర్లతో జరిగే వాణిజ్యం వలన భారత్ నష్టపోతున్నది.

ఎగుమతుల కంటే దిగుమతుల విలువ అధికంగా ఉండడంతో వాణిజ్య లోటు ఏర్పడింది. ఇది దేశానికి శ్రేయస్కరం కాదు. భారత్‌లో దాదాపు 80 శాతం చమురును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ తదితర గల్ఫ్ దేశాల మీద భారత్ ఆధారపడుతోంది. ఈ దేశాల నుంచి హార్మూజ్ జలసంధి గుండా భారత్‌కు నిత్యం చమురు రవాణా అవుతుంది. అయితే హార్మూజ్ జలసంధిని మూసివేసిన నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగాయి. వారం రోజుల వ్యవధిలోనే కేంద్రం రెండు సార్లు పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచింది.

ఈ నేపథ్యంలో పొదుపు అంశం పతాక శీర్షికలను అలంకరించింది. స్వదేశీ వస్తువుల వినియోగం పెంచితే, దేశానికి శ్రేయస్కరమని, అనవసరంగా ఖర్చులు చేయవద్దని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, ఇంధన వినియోగం తగ్గించుకోవాలని చేసిన సూచన ఆహ్వానించదగ్గ విషయమే అయినప్పటికీ, ఇది ఆచరణ సాధ్యమా? ధనవంతులు ఎలాగూ తమ జీవన విధానం మార్చుకోరు. సామాన్యులకు మాత్రం ఇక్కట్లు తప్పవు.

## ఆర్థిక తుఫానుకు 'పొదుపు'తో అడ్డుకట్ట వేయగలమా?


దేశంలో ఆర్థిక తుఫాను రాబోతుందని చెప్పిన మోడీ విదేశాలకు ఎలా వెళ్లారంటూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణ గురించి విన్నాం. నీతులు చెప్పడమే కాదు, ఆచరించి చూపాలన్న రాహుల్ గాంధీ విమర్శలు సరైనవేనా? అనే అంశం ఎలా ఉన్నా ప్రధాని, ముఖ్యమంత్రులు ప్రజల అవసరాల కోసం పర్యటనలు చేయడంలో తప్పులేదు కానీ, ఇతర ప్రజా ప్రతినిధులు తమ రాజకీయ కార్యకలాపాలను ఈ సందర్భంలో..

తగ్గించుకోవడం అవసరం. ప్రజలు మాత్రమే త్యాగాలు చేయాలనడం సబబు కాదు. ప్రజల ఇబ్బందులకు ప్రభుత్వాలే చాలా వరకు కారణం. అనుచిత వాగ్దానాలు, ఉచిత పథకాలే ఆర్థిక ఇబ్బందులకు కారణం. కేంద్రం, వివిధ రాష్ట్రాలు చేసిన అప్పులు గత 12 సంవత్సరాల్లో 60 లక్షల కోట్ల నుంచి 230 లక్షల కోట్లకు చేరినట్లు కొందరు విశ్లేషకుల అంచనా. ప్రజలను పొదుపు చేయమనడం మంచిదే. ఇది అన్ని రంగాల్లో వున్నవారు ఆచరిస్తే బాగుంటుంది.

## స్ట్రాటజిక్ నిల్వలపై లోపించిన స్ట్రాటజీ

ఇరాన్ అమెరికా దేశాల మధ్య యుద్ధం జరిగినా భారత్, చైనా తదితర దేశాల చమురు రవాణా నౌకలు యథాతథంగా హోర్ముజ్ నుండి పయనించేవి. దీనివలన భారత్‌లో ఇంధన కొరత సమస్య పెద్దగా రాలేదు. అయితే ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా దిగ్బంధనం చేయడం, ఇరాన్ ఓడ రేవులకు వచ్చి, పోయే నౌకలను ఆపడం వలన భారత్‌కు చమురు రవాణా నిలిచిపోయింది. 'నావల్ బ్లాక్' వలన భారత్‌కు ఇరాన్ నుండి వచ్చే చమురు ఆగిపోయింది.

అమెరికా, చైనా వంటి దేశాలు ఇలాంటి సమస్యను అధిగమించడానికి స్ట్రాటజిక్ ఆయిల్ రిజర్వ్‌లను సిద్ధం చేసుకున్నాయి. గతంలో వచ్చిన గల్ఫ్ సంక్షోభం నుండి భారత్ పాఠాలు నేర్చుకోలేదు. వ్యూహాత్మక ఆయిల్ నిల్వల పట్ల శ్రద్ధ చూపలేదు.కారుచౌకగా చమురు లభించినప్పుడు కూడా భారత్ ఆయిల్ నిల్వలను పెంచుకోవడంలో ఘోర వైఫల్యం చెందింది. ఈ కారణంగానే నేడు మనం చమురు కొరత వలన ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని అనుభవించక తప్పడం లేదు. ప్రభుత్వాలు తప్పు చేసి ప్రజలను పొదుపు పాటించమని చెప్పడం సాహసమే. సంక్షోభాల నుండి అవకాశాలను సృష్టించుకోవడంలో భారత్ విఫలమైన మాట వాస్తవం. ఇల్లు తగలబడిన తర్వాత బావి తవ్వినట్టుగా, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం అవివేకం. పొదుపు సూత్రాలు, ఆర్థిక క్రమశిక్షణ ప్రజలతో పాటు పాలకులు కూడా పాటించాలి. దిగుమతులను తగ్గించాలి. ఎగుమతులను ప్రోత్సహించాలి. విదేశీ మోజు తగ్గించాలి. రూపాయిని బలోపేతం చేయాలి.



## నిరుపేదలకు పొదుపు సూత్రాలా?

జీవితంలో కష్ట-సుఖాలు వచ్చి పోయే అతిథులు. చీకటి వెనుక వెలుతురు దాగున్నట్టు, కష్టాల వెనుక సుఖాలు కూడా సహవాసం చేస్తాయని మరవకూడదు. పౌర్ణమి తరువాత అమావాస్య మన ముందుకొస్తుంది. కలిమి లేములు, కష్టసుఖాలు మానవ జీవన చక్ర పరిభ్రమణంలో సహజ ప్రక్రియలు. అయితే కొందరి జీవితాలు ఎప్పుడూ కష్టాలకే అంకితం. మరికొందరి జీవితాలు విలాసాలమయం కావడం గమనార్హం.

బాల్యంతో మొదలైన కష్టాలు యవ్వన స్థితిని దాటి, 50 యేళ్లు, 60 యేళ్ళు దాటినా విడవకుండా వెంటాడితే ఇక అలాంటి జీవితాల్లో సుఖాలకు తావుంటుందా? కొందరి జీవితాలు ఎప్పుడూ మారవు. అవసరాలు పెరుగుతుంటాయి. ఎంత కష్టపడినా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే! అన్నట్టుగా ఆదాయం పెరగదు. ఎంత ఆర్థిక క్రమశిక్షణ పాటించినా, తరుముకొస్తున్న అవసరాలు ఖర్చులను పెంచుతూ పోతుంటాయి. గుర్రం గుడ్డిదయినా దాణా తప్పదన్నట్టు ఎంత పొదుపు చేసినా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, స్కూలు ఫీజులు, పై చదువులు, పెళ్ళిళ్ళు, అనారోగ్య సమస్యలు అరకొర ఆదాయాన్ని హారతి కర్పూరంలా హరించి వేస్తున్న నేపథ్యంలో ఇక పొదుపుకు చోటెక్కడ? తైలమే ఉంటే బోడి గుండెందుకన్న తెలుగు నానుడి పేదల జీవిత గమనంలోని హృదయమైన ఆర్థిక బాధలను స్పృశిస్తున్నది.

గంజి నీళ్లకు గతిలేని స్థితిలో కొందరుంటే, పంచ భక్ష్యపరమాన్నాలను భుజించినా జీర్ణించుకోలేని స్థితిలో పట్టు పరుపులపై పవళించినా నిద్ర పట్టని పరిస్థితుల్లో మరికొందరు నేటి ఆర్థిక అంతరాల వ్యవస్థలో మనకు అగుపిస్తారు. ఎంతటి సంక్షోభంలో నైనా కుబేరుల ఆదాయం “ఇంతింతై,వటుడింతై..” చందంగా ఆకాశాన్నంటుతుంటే, పేదల ఆదాయం పెరగడం లేదు. భారతీయుల తలసరి ఆదాయం కేవలం 2.3 లక్షలు మాత్రమే. వాస్తవానికి వ్యక్తిగత ఆదాయం ఇంతకంటే తక్కువగా ఉన్నవారు కోకొల్లలు. పేమెంట్ లేక పేవ్ మెంట్ల మీద బతుకుతున్న వారెందరో! డ్రైనేజీల వద్ద, రైల్వే ట్రాకుల పక్కన, బస్ షెల్టర్ల వద్ద, నదుల పక్కన, పుణ్య క్షేత్రాల వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్న వారెందరో!! కాలాలకు అతీతంగా చలిలో, మండుటెండలో, జోరు వానలో జీవిస్తూ, బతుకు చాలిస్తున్న అభాగ్యులెందరో మనకు తారస పడతారు. తిన్నా తినక పోయినా గుట్టుగా బతుకు బండిని లాగిస్తున్న వారెందరో! ఇక మధ్య తరగతి జీవుల బతుకుల గురించి ఎంత చెప్పినా తక్కువే. కడుపు కాల్చుకుని ఎంతో కొంత కూడబెట్టుకుని జీవిత నావను భారంగా తీరానికి చేరుస్తున్న వారి బాధలు వర్ణనాతీతం. 140 కోట్ల జనాభా గల ఈ సువిశాల భారతదేశంలో చాలీ చాలని సంపాదనతో జీవితాలను భారంగా, బాధ్యతగా గుట్టుగా నెట్టుకొస్తున్నవారే అధికం. వీరికి మనం పొదుపు సూత్రాలను వల్లించడం భావ్యం కాదు. ✦

# తీక్షణ వీక్షణంలోంచి..

ఈ క్షణం
తీక్షణంగా నిరీక్షణ చేస్తున్నాను
అక్షరాల దొంతరల్ని
పేర్చుకుంటున్నాను.

నిరీక్షణ వీక్షణంలోంచి లేచి
ఏవో క్షణాల్ని ఏరుకుంటున్నాను.
ఏకాంతం రాలుతుందో
అక్షరం ఏలుతుందో
మదిలో తుపానులు
తరుముతుంటాయి.
మనిషి మనుగడని
తరుముతుంటాయి.

అస్తిత్వం ప్రశ్నలు కుదుపుతూ
ఉంటాయి.
కాలంతో పోటీ పడటం
సవాళ్ళకు పరిష్కారాలు
అన్వేషించడంతోనే
క్షణాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

నాది కాని ప్రపంచంలో
నెగ్గికు రావాల్సిన సందర్భాలు
ఉంటాయి.

ఏం క్షణం నాది కాకపోయినా
తీక్షణంగా పరీక్షణ చేస్తే
ఏదో కొత్త రూపంలో
వెలుగు రేఖలు కన్పిస్తుంటాయి.

– గవిడి శ్రీనివాస్

# పుడమి కళ్ళు

మురిసే పెదవిలో
ముత్యాల సరళి..
చినుకు కురిసిన రాత్రి
వసంత హేల
రాగాల పల్లకిలో
రాణి దరహాసం..

పుడమి కళ్లు..
ఆకుపచ్చని పట్టుచీర తోరణం
మనసులో కదిలే
కడలి అలల ఆలోచనల తరంగాలు
జీవన సంగమం తొలి సంధ్యలో
మెరిసే ..
అనురాగ ప్రేమ హరివిల్లుల
పొదరిల్లు.

– కొండా రవీందర్

# నవ వసంతం అమ్మ

అమ్మ సృష్టికి మూలం,
ఆమె ప్రేమ అనంత సాగరం..
గర్భగుడిలో గుండె చప్పుడై,
జన్మనిచ్చే జీవన నాదం అమ్మ..
ఓనమాలు నేర్పే
జ్ఞానప్రదాత,
ఓర్పు, ఓదార్పుల
నిత్యప్రదాత
అమ్మ..
ఋతువులు మారినా
మారని నైజం,
కాలం గడిచినా
చెదరని బంధం..
ఎప్పటికీ
నవ వసంతం అమ్మ..
బుడిబుడి అడుగులకు
జోలపాడే స్వరం,
తడబడిన అడుగులకు నిలువెత్తు
ధైర్యం..
వెన్నంటి నడిపించే జీవన మార్గం
అమ్మ..



గెలిచిన వేళ గర్వంగా వెలిగే దీపం,
ఓడిన వేళ ఒడిలో ఒదిగించే శాంతి
స్వరూపం అమ్మ..
తన కలలను నీడలో దాచుకుని,
మన కలలకు
రెక్కలిచ్చి
ఎగరమనే
ఆశయం
అమ్మ..
అంతులేని త్యాగాలకు
అవధులేని రూపం,
అరమరికలేని ప్రేమకు
అక్షయ తూణీరం
అమ్మ..
జీవితం అనే పదానికి
తొలి అక్షరం అమ్మ,
జగతికి ప్రత్యక్ష దైవ స్వరూపం
అమ్మ..
ఓర్పులో అవని,
మమతానురాగాల గని అమ్మ.

ఈ వారం కవిత్వం

– రామిశెట్టి కావ్య

# మౌన సత్యం

సమస్యలు తుఫానుల్లా దూసుకొచ్చి
మనసు తీరాలను తాకిన వేళ
అల్లకల్లోల అలల నడుమ
ఆత్మధైర్యం పడవగా నిలవాలి!
గాలి
గర్జనలు
గుండెను
కుదిపినా
భయానికి
తలవంచని
నిశ్చయమే
మనలోని
నావికుడై
ముందుకు దారి చూపాలి!
చీకటి మేఘాలు కమ్ముకుని
జీవిత ఆకాశం మసకబారిన వేళ
మెరుపు క్షణికమైనదైనా
అంధకార గర్భంలో దారిని



చెబుతున్న
సూచనగా మెరుస్తుందని నమ్మాలి!
తుఫాను శాశ్వతం కాదు
గడిచిపోయే కాలపు అల మాత్రమే
దాన్ని ధైర్యంగా దాటితేనే
కొత్త తీరాలు మనకోసం
ఎదురు చూస్తాయి!
వాడిన కొమ్మల మధ్యనూ
పచ్చని చిగుళ్ల మెల్లగా
మొలుస్తాయి
అదే జీవితం చెప్పే మౌన సత్యం
కష్టాల గర్భంలోనే
కొత్త ఆరంభం పుడుతుంది!
సమస్యలు మనల్ని
విరిచేందుకు కాదు,
మన బలాన్ని మలచేందుకు వస్తాయి
తుఫాను దాటిన మనసే
ప్రశాంత సముద్ర సౌందర్యాన్ని
ఆస్వాదిస్తుంది.

– డాక్టర్ మామిడాల శైలజ

# మూడుముళ్లు

నేడు మనువాడిన మనసులన్నీ
ఒకటికొకటి
ఉతికి ఆరేసుకుంటున్నాయి.
ఉతుకుడుతో రంగుతేలి
మారుమనువుకెళుతున్నాయి
మూడు ముళ్ల బంధాలన్నీ
ముళ్లబాట పట్టుతున్నాయి.

– గాలిశెట్టి వేణుగోపాల్

సింగిల్ పేజీ కథ

# యుద్ధం

"ఏ యాహారానికైనా సరే నీతి, నిజాయితీలు రెండు కళ్ళలాంటివి. కొనేవోళ్ళ నమ్మకమే మనకు పెట్టుబడనేది గుర్తుబెట్టుకో.." చిన్నప్పుడు నాయన చెప్పిన మాటలు చిన్నబ్బ చెవుల్లో గింగురుమంటున్నాయి. అవన్నీ అప్పటి రోజులకు సరిపడినా, ఇప్పటి వ్యాపారాలు చూస్తుంటే సాధ్యమయ్యేలా లేవు. "ఎటు చూసినా దోపిడిదార్లు, మోసగాళ్ల వ్యాపారాలే గానీ సక్కగా వ్యాపారం చేసేవాడొక్కడూ లేడు. ఒకప్పుడు ఎంతో నమ్మకంగా సంవత్సరాల తరబడి మన్నిక కలిగి వస్తువులను తయారు చేసిన పేరున్న పెద్ద కంపెనీలు కూడా నేడు నమ్మకాలకు నీళ్లొదిలి, అమ్మకాల కోసం అడ్డదారులు తొక్కుతున్నాయి. నీతిమాలిన నయా వ్యూహాలతో నాణ్యతకు తిలోదకాలిచ్చి, మన్నికను మాయం చేస్తున్నాయి. వస్తుజీవితాన్ని మూనాళ్ల ముచ్చట చేసి, నిఖార్సు కాని వస్తువులనే నిరంతరం కొనిపిస్తూ కోట్లు కొల్లగొడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చితికిపోయిన చిల్లర వ్యాపారి నిబద్ధతతో నిలబడి బతకాలంటే ఎలా నాయనోయ్..?" అని ఆలోచిస్తున్నాడు చిన్నబ్బ.



సత్తెకాలపు చిన్నయ్య 'చిల్లరకొట్టు చిన్నబ్బ'గా మారినా మనిషి మాత్రం కాలానుగుణంగా మారి కలుషితం కాలేకపోయాడు. నేటి పరిస్థితులను చూస్తుంటే మారక తప్పేలా లేదనుకున్నాడు చిన్నబ్బ చింత. తానుండే పల్లెటూరును సీఆర్డీఏలో కలపడంతో బడా కంపెనీలు రంగంలో దిగి షాపింగ్ మాల్ పెడుతుండటమే చిన్నబ్బ చావుకొచ్చింది.

అతని షాపుకెదురుగానే ఓ పెద్ద 'మాల్' వెలసి హోల్ సేల్‌గా అమ్మకాలు షురూ చేయడంతో సాఫీగా సాగిపోతోన్న చిన్నబ్బ వ్యాపారం చిన్నాభిన్నమైంది. ఉప్పులు, పప్పులు కూడా ఆ మాల్‌లో కూడా దొరుకుతుండటంతో జనం వేలంవెర్రిగా వెళ్ళి కొంటున్నారు. ఏసి మాల్స్‌లో ఎగబడి ఏరుకోవడమే ప్యాషన్‌గా పిలవుతున్నారు జనం. ప్రపంచీకరణతో ఆదాయాలు అడ్డంగా పెరిగిన చిన్నా చితకా కొనుగోలుదార్లు సైతం గతాన్ని మరచి కిరాణా కొట్లలో కొనుగోలు చేయకపోవడంతో చిన్న వర్తకుల బతుకులు ఛిద్రమై, చెట్టుకొకరు పుట్టకొకరుగా చెదిరిపోయారు. చిన్నబ్బ మాత్రం పొట్టేలు కొండను ఢీకొన్న మాదిరి పోటీపడైనా వ్యాపారాన్ని నడపాలనే నిర్ణయంతో నిలబడి ఉన్నాడు.

తను నెగ్గాలంటే మాల్‌లో అమ్మే వస్తువుల ధరలకన్నా తక్కువకు అమ్మాలి. కంపెనీకి తగ్గింపు ధరల్లో వస్తువులు ఇవ్వడం కష్టమేం కాదు. కానీ దానికన్నా తక్కువకు అమ్మి తను మనుగడ సాగించగలడా? అని ఆలోచిస్తున్నాడు. తనది జీవన్మరణ సమస్య కాబట్టి తెగించక తప్పదనుకున్నాడు.

"ఒక ఐడియా జీవితాన్నెలా మార్చేస్తుందో చూద్దామని మరుసటి రోజు మాల్‌లో యాభై రూపాయలున్న కేజీ బియ్యం ధర నలభై ఐదు రూపాయలకే ఆఫర్‌లో ఇస్తున్నట్టు బోర్డు పెట్టేడు. చుట్టుపక్కల షాపులన్నీ మూత పడినా చిత్రంగా చిన్నబ్బది చెక్కు చెదరకపోవడం, పైగా అత్యవసరమైన బియ్యాన్ని తమకన్నా ఐదు రూపాయలు తక్కువకే అమ్మజూపడం చూసి మాల్ యజమానికి కుతూహలం కలిగింది. ఏం చేస్తాడో చూద్దామని వెంటనే బియ్యంపై పది రూపాయలు తగ్గింపు ప్రకటించేడు. చిన్నబ్బ ఇవేమీ పట్టనట్టు రెండ్రోజుల తర్వాత తాపిగా కందిపప్పు ధర తగ్గిస్తూ బోర్డు పెట్టాడు. అది చూసి మాల్ యజమానీ ధర తగ్గించేడు. చిన్నబ్బ అలా ప్రతి రెండు రోజులకి ఒక్కో సరుకుపై ఆఫర్లిస్తూ బోర్డు పెట్టసాగేడు. దీనితో మాల్ యజమానిలో పట్టుదల పెరిగి తను కూడా తగ్గించసాగాడు.

ఇద్దరూ ధరల దాడితో యుద్ధానికి దిగేరు. తన దెబ్బకు చిన్నబ్బ కిరాణా బిచాణా ఎత్తేయడం ఖాయమనుకున్నాడు మాల్ యజమాని. కానీ చిన్నబ్బ మరింత ఉత్సాహంగా కొట్టును కొనసాగిస్తూనే వున్నాడు. ఇది మాల్ యజమానికి మింగుడు పడక చిన్నబ్బ ధర తగ్గించినపుడల్లా పంతంతో ధరలు తగ్గించసాగాడు. దాంతో సరుకు కూడా వేగంగా అమ్ముడయిపోతుండటంతో ధరల యుద్ధంలో దూకుడు పెంచేడు. చిన్నబ్బ ధర తగ్గించాక షాప్‌కి జనాలు రాకముందే మాల్‌లో ధర తగ్గిస్తున్నట్టుగా బోర్డు పెడుతుండటంతో చిన్నబ్బ చిల్లర దుకాణం చివరికి చిత్తయిపోయింది. చిన్నబ్బ మాత్రం చీకూ, చింతా లేకుండా హాయిగానే కాలం గడిపేస్తున్నాడు.

షాపింగ్ మాల్‌లో ధర తగ్గిన సరుకులన్నీ చిన్నబ్బ మూడో కంటికి తెలీకుండా కొనేస్తూ వాటిని తీసుకెళ్లి పోటీ ఎక్కువగా లేని ఏరియాలో అమ్ముకోసాగేడు. సరుకుల కోసం సిటీకెళ్లాల్సిన పనిలేకుండా, తనపై ధరల దాడి చేస్తోన్న మాల్‌లోనే కొంటూ, మార్కెట్ ధరకన్నా నామమాత్రపు తక్కువ రేటుకు అమ్మడం ద్వారా డిమాండు పెంచుకున్నాడు. అది కూడా తెలివిగా రెండు రోజులకో నిత్యావసర వస్తువునెంచుకొని దానిమీద 'ముదరా' ఇస్తూ యుద్ధ వాతావరణాన్ని తన అమ్మకాలకు అవకాశంగా మార్చుకున్నాడు.

ఎగువ తరగతి పేదలు ఎక్కువగా వుండే ఏరియాల్లో తన 'మినీ మొబైల్ హోల్ సేల్ సూపర్ మార్కెట్'లో తక్కువ రేటుకు అమ్ముతూ, ఎవరికీ నష్టం లేకుండా, తానూ పైసా నష్టపోకుండా 'నయాబజారు' నడుపుతూ తను నిలదొక్కుకున్నాడు. తన కడుపు కొట్టబోయిన మహా మాల్‌లో దర్జాగా 'దంగల్' చేస్తూ తన వ్యాపారాన్ని నడుపుతున్నాడు చిన్నబ్బ.

– బట్టేపాటి జైదాస్

# విద్యార్థుల విజయానికి..

ప్రస్తుత ఆధునిక యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ప్రపంచం విద్యార్థుల జీవనశైలిని పూర్తిగా మార్చేశాయి. సమాచారాన్ని సులభంగా పొందగలిగే అవకాశాలు పెరిగినప్పటికీ, చదవడం, రాయడం వంటి మౌలిక నైపుణ్యాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి తగ్గిపోతున్నదనే ఆందోళన సమాజంలో పెరుగుతోంది. కానీ నిజానికి విద్యార్థుల జీవిత నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించేవి ఈ చదవడం, రాయడం నైపుణ్యాలే.

చదవడం అనేది కేవలం పుస్తకాలు చదవడమే కాదు; అది మనిషి ఆలోచనా ప్రపంచాన్ని విస్తరించే ప్రక్రియ. మంచి పుస్తకాలు చదివే విద్యార్థులు జ్ఞానాన్ని మాత్రమే కాదు, విలువలను, సంస్కృతిని, సమాజాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కూడా పొందుతారు. చదవడం వల్ల భాషా పటిమ పెరుగుతుంది, పదసంపద విస్తరిస్తుంది, ఆలోచనల్లో లోతు పెరుగుతుంది. ఒక మంచి పాఠకుడు ఎప్పుడూ ప్రశ్నించడం నేర్చుకుంటాడు. విషయాలను విశ్లేషించి అర్థం చేసుకునే అలవాటు పెంపొందుతుంది. ఇప్పుడు చాలా మంది విద్యార్థులు చిన్న వీడియోలు, సోషల్ మీడియా సందేశాలకే పరిమితమవుతున్నారు. దీని ఫలితంగా ఎక్కువసేపు ఏకాగ్రతతో చదివే అలవాటు తగ్గిపోతోంది. పుస్తకాల పట్ల ఆసక్తి తగ్గడం విద్యార్థుల మేధో వికాసానికి ప్రమాదకర సంకేతం. ఎందుకంటే చదవడం మనిషిలో ఓర్పు, క్రమశిక్షణ, పరిశీలనా దృష్టి వంటి లక్షణాలను పెంపొందిస్తుంది. ఇవి భవిష్యత్తులో ఉన్నత విద్యకైనా, ఉద్యోగ జీవితానికైనా అత్యంత అవసరం.



అలాగే రాయడం కూడా విద్యార్థి వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర పోషిస్తుంది. రాయడం అనేది కేవలం అక్షరాలు గీయడం కాదు; మన ఆలోచనలను సక్రమంగా వ్యక్తపరచే కళ. ఒక విద్యార్థి స్పష్టంగా రాయగలిగితే అతడు స్పష్టంగా ఆలోచించగలడని అర్థం. వ్యాసాలు, నివేదికలు, లేఖలు, పరీక్షల సమాధానాలు ఏ రూపంలో అయినా రాయడం విద్యార్థి ప్రతిభను తెలియజేస్తుంది. కానీ ప్రస్తుతం డిజిటల్ కమ్యూనికేషన్ ప్రభావంతో విద్యార్థులు సంక్షిప్త పదాలు, ఎమోజీలు, వ్యాకరణ రహిత భాషను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీని వల్ల సరైన భాషా నైపుణ్యాలు దెబ్బతింటున్నాయి. చదవడం, రాయడం రెండూ కలిసే విమర్శనాత్మక ఆలోచనను పెంపొందిస్తాయి. పుస్తకాలు చదవడం ద్వారా వివిధ అభిప్రాయాలను తెలుసుకుంటారు. వాటిపై ఆలోచించి రాయడం ద్వారా స్వంత అభిప్రాయాలను నిర్మించుకుంటారు. ఈ ప్రక్రియ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుంది. సమాజ సమస్యలను అర్థం చేసుకుని వాటిపై స్పందించే శక్తి కలుగుతుంది.

చదవడం, రాయడం విద్యార్థుల భావోద్వేగ వికాసానికీ తోడ్పడతాయి. సాహిత్యం చదివేవారు మానవ సంబంధాలు, భావోద్వేగాలు, జీవిత సత్యాలను లోతుగా అర్థం చేసుకుంటారు. డైరీ రాయడం, కథలు రాయడం, కవిత్వం రచించడం వంటి అలవాట్లు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి. విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో ఇవి ఉపయోగపడతాయి. ఈ నైపుణ్యాల పెంపొందింపులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాల పాత్ర అత్యంత ముఖ్యమైనది. ఇంట్లో పుస్తకాలు చదివే వాతావరణం ఉండాలి. పిల్లలతో వార్తాపత్రికలు చదివించడం, కథలు చెప్పించడం, చర్చలు జరపించడం అవసరం. పాఠశాలల్లో గ్రంథాలయాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. వ్యాసరచన, కథారచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించవచ్చు.

ప్రభుత్వాలు కూడా విద్యా విధానంలో భాషా అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటు, పుస్తకాల అందుబాటు, ఉపాధ్యాయుల శిక్షణ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. మాతృభాషతో పాటు ఇతర భాషల్లోనూ చదవడం, రాయడం ప్రోత్సహించాలి.

అయితే సాంకేతికతను పూర్తిగా తప్పుబట్టలేం. సరైన విధంగా ఉపయోగిస్తే డిజిటల్ ప్రపంచం కూడా చదవడం, రాయడం నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ పుస్తకాలు, ఆన్‌లైన్ గ్రంథాలయాలు, విద్యా వెబ్‌సైట్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. కానీ వినోదం, విద్య మధ్య సమతుల్యతను పాటించడం అత్యంత అవసరం. చదవడం, రాయడం విద్యార్థుల జీవితానికి పునాది వంటివి. ఇవి కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడానికి మాత్రమే కాదు; వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞానవృద్ధికి, సమాజాభివృద్ధికి అవసరమైన సాధనాలు. అందువల్ల ప్రతి విద్యార్థిలో చదవడం, రాయడం పట్ల ఆసక్తిని పెంపొందించడం కుటుంబం, పాఠశాల, సమాజం అందరి బాధ్యతగా భావించాలి.

– తిప్పర్తి శ్రీనివాస్

# అద్భుత పర్యాటక దీవులు.. అండమాన్

భారతదేశంలోని కేంద్రపాలిత ప్రాంతాలలో అండమాన్ నికోబార్ దీవులు ఒకటి. ఇది మొత్తం 572 ద్వీపాలను కలిగి ఉంది. అండమాన్‌లో 550 దీవులు ఉన్నాయి. వీటిలో 28 దీవుల్లో మానవులు నివసిస్తున్నారు. నికోబార్ 22 ద్వీపాలను కలిగి ఉంది. వీటిలో 10 దీవుల్లో మానవులు నివసిస్తున్నారు. అండమాన్‌లో మాట్లాడే భాషలు బెంగాలీ, హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, ఇంగ్లీష్.

1789లో బ్రిటీష్ వారు అండమాన్‌లో తమ జెండాను ఎగురవేశారు. మొదటగా ఇక్కడ దోషుల స్థావరాన్ని, ఓ కాలనీని స్థాపించడానికి ప్రయత్నించారు. అయితే అది విఫలమైంది. 1857లో అల్లర్లు చెలరేగినప్పుడు ఉరితీత, తూటాలు, ఫిరంగులు ఉద్యమకారుల ప్రాణాలను బలిగొన్నాయి. ఉద్యమకారులలో కొందరికి జీవిత ఖైదు పడింది. అయితే బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసినవారు మళ్లీ తిరుగుబాటు చేయకుండా ఉండటం కోసం దూరంగా ఓ జైలు శిబిరం అవసరం. దీని కోసం బ్రిటిష్ వారి కళ్లు అండమాన్ దీవుల వైపు వెళ్లాయి. బ్రిటీష్ వారికి, వారి అధికారులు, సేవకులు, ఇతర సేవకుల కోసం గుడారాలు నిర్మించుకున్నారు.



కానీ ఖైదీలకు చాలా కాలం తర్వాత గుడిసెలు లాంటి వసతి లభించింది. ఖైదీల విధి ఏమిటంటే రోజంతా కఠినమైన నిర్బంధంలో, అలసిపోని శ్రమ, క్రూరత్వం, హింస, తక్కువ ఆహారంతో సంతృప్తి చెందడం. మరణాన్ని కొనసాగించడం. అందుకే ప్రతి ఖైదీ మరణం కోసం ప్రార్థించాడు. ఎందుకంటే ఆ భయంకరమైన సమస్యల నుంచి బయటపడేందుకు మరణం ఒక్కటే మార్గం అనుకున్నారు. బాధలు, వ్యాధులతో కూడిన బతుకులక్కడ. దుర్వాసన, వ్యాధి, అంతులేని దురద, స్థిరమైన పొట్టు చర్మ వ్యాధులు చాలా సాధారణం.

పంతొమ్మిదవ శతాబ్దం చివరి నాటికి స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. దీంతో అండమాన్‌కు పంపే ఖైదీల సంఖ్య పెరగడంతో పాటు అత్యంత భద్రతతో కూడిన జైలు అవసరం ఏర్పడింది. తప్పించుకోవడానికి ప్రయత్నించిన వారిని ఉరితీసేసేవారు. ఈ క్రమంలోనే అక్కడ ఓ సెల్యులార్ జైలు పుట్టింది. సెల్యులార్ జైలు నిర్మాణం 1896లో ప్రారంభమైంది. సెల్యులార్ జైలు 1906లో పూర్తయింది. ఖైదీలను పదమూడున్నర అడుగుల పొడవు, ఏడు అడుగుల వెడల్పు గల ఏడు వందల గదులలో బంధించారు. జైలు మధ్యలో ఉన్న ఒక టవర్ నుండి బందీలను పర్యవేక్షించేవారు. జైలు గదులలో కాంతి మాత్రం ఉండేది. మలమూత్ర విసర్జనలకు నిర్ణీత సమయాలంటూ నిర్దేశించారు. బ్రిటీష్ వారు ఎవరినైనా ఉరితీయగలిగేలా ఒక స్థలం కూడా ఏర్పాటు చేశారు.

బ్రిటీష్ వలస ప్రభుత్వం రాజకీయ ఖైదీలను ఒంటరిగా ఉంచాలని కోరుకున్నందున ఏకాంత జైలు అనేది ఉనికిలోకి వచ్చింది. సెల్యులార్ జైలులో, దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తీసుకువచ్చిన ఖైదీలు, వివిధ నేరాలలో దోషులుగా, భయంకరమైన హింసకు గురయ్యారు. పిండి మిల్లులు నిర్వహించడం, నూనె గానుగాడించడం, రాళ్లు పగలగొట్టడం, చెట్లు నరకడం, వారం రోజుల పాటు తాళాలు వేసి గదిలోనే ఒంటరిగా బంధించడం, నాలుగు రోజుల వరకు ఆకలితో మాడ్చడం మొదలైనవి.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో 1942 మార్చిలో జపాన్ దృష్టి అండమాన్ దీవులను ఆక్రమించింది. భారత స్వాతంత్ర్య సమరయోధులను బంధించారు. అక్కడ జరిగిన హింసలో చాలా మంది చనిపోయారు. వారిలో మూడవ వంతు మునిగిపోయారు. ఒడ్డుకు చేరినవారు ఆకలితో చనిపోయారు.

ఆరు వారాల తర్వాత బ్రిటిష్ రిలీఫ్ వర్కర్లు వచ్చినప్పుడు, కేవలం 11 మంది ఖైదీలు మాత్రమే సజీవంగా ఉన్నారు.

మరుసటి రోజు, 800 మంది ఖైదీలను మరొక జనావాసాలు లేని ద్వీపానికి తీసుకెళ్లారు. అక్కడ వారిని ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు వచ్చిన వారందరినీ కాల్చిచంపారు. తర్వాత సైనికులు వచ్చి మృతుల మృతదేహాలను దహనం చేసి పాతిపెట్టారు. 1945 అక్టోబరులో జపనీయులు ఐక్య దళాలకు లొంగిపోయారు. అండమాన్ దీవులు తిరిగి బ్రిటిష్ ఆధీనంలోకి వచ్చాయి. ఈసారి బాధితుల్లో జపనీయులు కూడా ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగింపులో జపాన్ లొంగిపోయిన ఒక నెల తరువాత, బ్రిటీష్ వారు శిక్షించడం కోసం ఏర్పాటు చేసిన ఇక్కడి కాలనీని నాశనం చేసింది. 1945 అక్టోబర్ 7న శిక్షా కాలనీని నాశనం చేశారు. ఖైదీలను భారతదేశంలోని వివిధ ప్రాంతాలలోని జైళ్లకు పంపారు.

## అదానీకి అండమాన్ నికోబార్ భూమి ప్రాజెక్ట్, భారతదేశంలో ప్రతిచర్యలు

భారతదేశపు తొంభై వేల కోట్ల గ్రేట్ నికోబార్ ద్వీప అభివృద్ధి ప్రాజెక్ట్, మలక్కా జలసంధి సమీపంలో ఉన్న ఒక భారీ వ్యూహాత్మక, వాణిజ్య మౌలిక సదుపాయాల కార్యక్రమం. ఇందులో ఒక ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, ఒక విమానాశ్రయం, టౌన్‌షిప్‌లు ఉన్నాయి. తీవ్రమైన రాజకీయ, పర్యావరణ వివాదానికి దారితీసిన ఈ పోర్టు అభివృద్ధిలో అదానీ గ్రూప్ ఒక కీలక పోటీదారుగా ఉంది. చైనా సముద్ర ప్రభావానికి ప్రతిఘటనగా, ప్రస్తుతం సింగపూర్, కొలంబోలకు మళ్లించే సరుకు రవాణాను చేజిక్కించుకోవడానికి, ఈ మారుమూల ద్వీపాన్ని ఒక ప్రధాన ఇండో పసిఫిక్ షిప్పింగ్ కేంద్రంగా మార్చడం ప్రాజెక్ట్ ఆశయం. అయితే దీనిపై వివాదాలు తలెత్తాయి. భారత జాతీయ కాంగ్రెస్ నేతృత్వం లోని ప్రతిపక్షం ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శిస్తోంది. విలువైన గిరిజన పూర్వీకుల భూమిని అప్పగించడానికి, లక్షలాది చెట్లను నరికివేయడానికి, కేవలం అదానీ గ్రూప్‌కు ప్రయోజనం చేకూర్చడానికే ఈ ప్రాజెక్టును రూపొందించారని ఆయన, ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మరోవైపు పర్యావరణవేత్తలు, జీవావరణ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఈ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిలో భాగంగా, సుమారు 160 చదరపు కిలోమీటర్ల (మొత్తం అటవీ విస్తీర్ణంలో సుమారు 1.8 శాతం నుండి 2 శాతం) సహజసిద్ధమైన, పురాతన వర్షారణ్యాలను నరికివేయనున్నారు. భూకంపాలు తరచుగా సంభవించే, సునామీలకు గురయ్యే ఈ ప్రాంతంలో, ఇది 2,500కు పైగా వన్యప్రాణుల జాతుల ఆవాసాలను నాశనం చేస్తుందని, పగడపు దిబ్బలపై తీవ్ర ప్రభావం చూపుతుందని విమర్శకులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోని ఆదివాసీ సమాజాలు, ముఖ్యంగా బలహీనమైన షోంపెన్, నికోబరీస్ తెగలు, స్థానభ్రంశం, సాంస్కృతిక విఘాతం ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. లక్షలాది మంది బయటి వలసదారుల రాక ఈ ఏకాంత సమాజాలను తుడిచిపెట్టేస్తుందని కార్యకర్తలు, గిరిజన మండలాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే భారత ప్రభుత్వం మాత్రం తమ ప్రణాళికను సమర్థించుకుంటోంది. కేంద్రం, అధికార బీజేపీ అవినీతి ఆరోపణలను తోసిపుచ్చుతూ, ఈ ప్రాజెక్టును గట్టిగా సమర్థిస్తున్నాయి. జాతీయ భద్రతకు, ఆర్థిక వృద్ధికి ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని కేంద్ర పర్యావరణ మంత్రులు వాదిస్తున్నారు.

## సెల్యులార్ జైలు

కాలా పానీ అని పిలువబడే అత్యంత ప్రసిద్ధ సెల్యులార్ జైలు ఇది. ఇది అండమాన్, నికోబార్ దీవుల రాజధానిలో ఉంది. దీనికి పోర్ట్ బ్లెయిర్ అని పేరు పెట్టారు. కృష్ణాజలాల శిక్షతో క్రూరంగా ప్రవర్తించిన ఖైదీలు ఈ జైలులో శిక్ష అనుభవించారు.
అండమాన్‌లోని సెల్యులార్ జైలు గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలున్నాయి. ఈ సెల్యులార్ జైలు అండమాన్, నికోబార్ దీవుల సరిహద్దుల్లో పోర్ట్ బ్లెయిర్ వద్ద ఉంది. జైలు చుట్టూ అనేక కిలోమీటర్ల లోతైన సముద్రం ఉంది. దీనిని దాటడం అంత తేలిక కాదు. ఈ జైలులో, అత్యంత చిన్న చిన్న చుట్టుకొలతలతో కూడిన  గోడలుంటాయి. ఈ గోడలను ఎవరైనా సులభంగా దాటవచ్చు. కానీ ఆ తర్వాత, ఖైదీ తప్పించుకునే ప్రయత్నంలో సముద్రంలో పడిపోతాడు. బ్రిటిష్ ప్రభుత్వానికి ఈ జైలును నిర్మించడానికి దాదాపు పదేళ్లు పట్టింది.



భారతదేశ స్వాతంత్ర్య పోరాటం సమయంలో రాజకీయ దోషులను మారుమూల ప్రాంతానికి తరలించడానికి బ్రిటీష్ వారు ఈ జైలును ప్రధానంగా ఉపయోగించారు. ఈ జైలును రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ సైనికులు స్వాధీనం చేసుకున్నారు. చాలా మంది బ్రిటిష్ సైనికులను ఇక్కడ నిర్బంధించారు. దీనిని ఆసియా ఖండంలోని ప్రధాన జైళ్లల్లో ఒకటిగా పరిగణించేవారు. ప్రస్తుతం, ఈ ప్రదేశం ప్రసిద్ధ జాతీయ స్మారక చిహ్నం రూపంలో పర్యాటకులు దీనిని సందర్శిస్తూ ఉంటారు. దీనిని నేషనల్ మెమోరియల్ అని పేర్కొంటున్నారు. ఈ ప్రదేశం ప్రధాన ఆకర్షణ అక్కడి మ్యూజియం. ఇది జైలు జీవితం, దేశంలోని ప్రముఖ రాజకీయ ఖైదీలు ఎదుర్కొన్న పోరాటాలను ప్రముఖంగా ప్రదర్శిస్తున్నారు. అమరవీరుల స్మారకార్థం ప్రదేశంగా ఇది రంగురంగుల దీపాలతో వెలిగిపోతోంది. వారంలో నాలుగు రోజులు సౌండ్ అండ్ లైట్ షో నిర్వహిస్తూ ఉంటారు. గతంలో సెల్యులార్ జైలు మెమోరియల్ వద్ద నిర్వహించిన కార్యక్రమాలను వివరించడం దీని లక్ష్యం. ఈ మ్యూజియంలో బ్రిటీష్ వారు స్వాతంత్ర్య సమరయోధులపై పోరాడేందుకు ఉపయోగించిన ఆయుధాలను భద్రపరిచారు.

సెల్యులార్ జైలు రూపకల్పనంతా ఆంగ్ల తత్వవేత్త, సామాజిక ఆలోచనాపరుడు జెరెమీ బెంథమ్, పనోప్టికాన్ భావన నుండి ప్రేరణ పొందింది. ఈ జైలు ఆక్టోపస్ ఆకారంలో నిర్మింతమైంది. జైలు మధ్యలో ఒక టవర్ నిర్మించారు. దీనిపై నుంచి ఖైదీలపై కదలికలను గమనించేవారు. అయితే ఆ విషయం ఖైదీలకు తెలిసేది కాదు.

**– యామిజాల జగదీశ్**

కథ

# ఫలితం ఆశించకూడదు

శివ చాలా తెలివైన విద్యార్థి. క్లాసులో పాఠాలన్నీ బాగా వింటాడు, కానీ ‘పరీక్షలు’ అనే పదం వినగానే అతనికి జ్వరం వచ్చినంత పనయ్యేది. సరిగ్గా చదవలేక, వచ్చినవి కూడా మర్చిపోయి భయపడేవాడు.

ఒకరోజు శివ దిగులుగా కూర్చోవడం చూసిన వారి మాస్టారు స్వామి అతని దగ్గరకు వచ్చారు.

“ఏమైంది శివా? ఎందుకు అలా ఉన్నావు?” అని అడిగారు.

“మాస్టారూ! రేపటి నుంచి పరీక్షలు. నాకు చాలా భయంగా ఉంది. నేను ఫెయిల్ అవుతానో, తక్కువ మార్కులు వస్తాయో అని కంగారుగా ఉంది” అని చెప్పాడు.



మాస్టారు చిరునవ్వుతో “శివా, సాయంత్రం మన స్కూల్ స్టోర్ రూమ్ దగ్గరకు రా! నీకు కొన్ని చిట్కాలు చెబుతాను” అని చెప్పి వెళ్లిపోయారు.

సాయంత్రం శివ స్టోర్ రూమ్ దగ్గరకు వెళ్ళాడు. మాస్టారు శివతో, “లోపల టేబుల్ మీద ఒక పుస్తకం ఉంది, వెళ్లి తీసుకురా” అన్నారు. బయటి నుంచి చూస్తే లోపల అంతా చీకటిగా ఉంది. శివ భయంగా, “అమ్మో! లోపల ఏముందో కనిపించడం లేదు సార్, నేను వెళ్ళలేను” అన్నాడు.

వెంటనే మాస్టారు శివ చేతిలో ఒక టార్చ్ లైట్ పెట్టారు. “ఇప్పుడు వెళ్ళు” అన్నారు.

శివ టార్చ్ వేసుకుని ధైర్యంగా లోపలికి వెళ్లి, సులభంగా పుస్తకాన్ని పట్టుకుని బయటకు వచ్చాడు.

అప్పుడు మాస్టారు “చూశావా శివా! గది అదే, చీకటి అదే. కానీ నీ చేతిలో టార్చ్ లైట్ ఉండటం వల్ల నీకు భయం వేయలేదు. పరీక్షలు కూడా ఆ చీకటి గది లాంటివే. నీ ‘సన్నద్ధత’ అనేదే ఆ టార్చ్ లైట్. నువ్వు ఎంత బాగా చదివి సిద్ధంగా ఉంటే, ఆ లైట్ అంత ప్రకాశవంతంగా ఉంటుంది. అప్పుడు లోపల ఏ ప్రశ్న ఉన్నా నువ్వు సులభంగా సమాధానం రాయగలవు” అన్నారు. ఆ మాటలతో శివకి గొప్ప ఉపశమనం లభించింది. భయం అనేది మనసులో ఉంటుందని, ఆ భయం పోవాలంటే సరైన ప్రణాళికతో చదివితే మనలో కలిగే ఆత్మవిశ్వాసం మనకు వెలుగునిస్తుందని అర్థం చేసుకున్నాడు.

ఫలితం గురించి ఆలోచించడం మానేసి, చదవడం మీద దృష్టి పెట్టాడు. ఆ సంవత్సరం శివ క్లాస్ ఫస్ట్ వచ్చాడు. “భయం అజ్ఞానం వల్ల వస్తుంది, ధైర్యం సన్నద్ధత వల్ల వస్తుంది.

ఫలితం గురించి ఆందోళన చెందకుండా, ఇష్టపడి చదవడం మీద దృష్టి పెడితే విజయం అదే వస్తుంది” అనే విషయం చక్కగా అర్థమైన శివ జీవితంలో ఉన్నత స్థితికి చేరడానికి అడుగులు వేశాడు.

– మొర్రి గోపి, కవిటి



వార్త ఆదివారం

## బాలగేయం

### బడి పిల్లలం

పిల్లలం..
రేపటి భారత పౌరులం
కంప్యూటర్ పిడుగులం
ఈ కాలపు వెలుగులం
చూసింది విన్నది
వెనువెంటనే మా సొంతం
బట్టీ పట్టి చదవం.
అమ్మ భాష మాకిష్టం
అన్య భాష ఇంకిష్టం
కవుల రచయితల
కవితలన్నీ చదువుతం.
షేక్స్పియర్ చెప్పినట్టి
స్టోరీలు అల్లుతం
చిక్కు లెక్కలు విప్పినట్టి
రామానుజన్ వారసులం.
ప్రయోగాలు చేసినట్టి
సివి రామన్ సోదరులం
ఆటలెన్నో ఆడుతం
పాటలన్ని పాడుతం.
చరితనంత తిరిగేసి
కొత్త చరిత రాసేస్తం
మేం పిల్లలం
భరతమాత బిడ్డలం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

చిన్నారుల ప్రశ్నలకు
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**ఎల్.మంజూష, తుని**

**ప్రశ్న: వాతావరణంలోని మార్పులను శాస్త్రీయంగా ఎలా గుర్తిస్తారు?**

**జవాబు:** కోట్లకొద్దీ గ్రహాలూ, నక్షత్రాలతో కళ్ల మిరుమిట్లు గొలిపే అంతరిక్షం అనే అద్భుత ప్రపంచం నుంచి కొన్ని శక్తిమంతమైన కిరణాలు, రేణువులు నిరంతరం మన భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంటాయి. ఆ విధంగా ప్రవేశించిన ఆ ప్రత్యేకమైన రేణువుల ఆధారంగా మన భూ ఉపరితల వాతావరణంలో చోటు చేసుకునే మార్పులను ముందుగానే గుర్తించవచ్చని శాస్త్రజ్ఞులు ఊహిస్తున్నారు.

అంతరిక్షం నుంచి కొన్ని కాస్మిక్ కిరణాలు వాతావరణం పైపొరలను ఢీకొనగానే వాటి నుంచి కొన్ని రేణువులు వానజల్లుగా ఉద్భవించి భూ వాతావరణంలోకి ప్రవేశిస్తాయి. ఈ విధంగా ఏర్పడిన ఈ రేణువుల సంఖ్యను లెక్కించడం ద్వారా వాతావరణ ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులను ముందుగానే గుర్తించవచ్చని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

**ఎన్.కార్తికేయ, గుమ్మడిపూడి**


**ప్రశ్న: వజ్రం ఎలా ఏర్పడుతుంది?**

**జవాబు:** వజ్రం స్ఫటిక రూపంలో ఉండే బొగ్గు వంటిది. భూ అంతర్భాగాలలో లభిస్తుంది. వజ్రం ఉష్ణవాహకమే అయినా దీనిగుండా విద్యుత్ ప్రవహించదు. సహజ వజ్రాలనేవి గనుల నుంచే వెలికి తీస్తారు. ఇది 900 డిగ్రీ సెంటీగ్రేడ్‌లో కాలడం ప్రారంభమై నెమ్మదిగా వాతావరణంలోని ప్రాణవాయువుతో కలిసి బొగ్గుపులుసు వాయువు(కార్బన్ డై ఆక్సైడ్)గా మారుతుంది. భూ అంతర్భాగాలలోని అత్యధిక ఉష్ణోగ్రతలో బొగ్గు వజ్రంగా రూపాంతరం చెందుతుంది. భూ అంతర్భాగాలలోని అత్యధిక ఉష్ణోగ్రతలో బొగ్గు వజ్రంగా రూపాంతరం చెందుతుంది. ప్రపంచ స్థాయిలో ఆఫ్రికా ఖండంలో సహజ వజ్రాలు అధికంగా లభిస్తాయి.





## కృత్రిమ 'టోర్నడో'



కొన్ని సార్లు గాలి సుడులు తిరుగుతూ ఇళ్ల పై కప్పులను లేపేస్తూ విధ్వంసం సృష్టిస్తుంది. మైదానాల్లో అప్పుడప్పుడూ సుడిగాలి వస్తుంది. ఈ పోలికలతో ఉండేదే 'టోర్నడో'. కృత్రిమ టోర్నడోను సృష్టించే వ్యవస్థ జర్మనీలోని స్టగార్ట్‌లో ఉన్న మెర్సిడెస్ బెంజ్ మ్యూజియంలో మాత్రమే ఉంది. ఈ వ్యవస్థ ఇక్కడ తప్ప మరెక్కడా లేదు. అందుకే ఇది గిన్నిస్ బుక్ రికార్డులోకెక్కింది. ఈ టోర్నడో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. అయితే ఈ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశమే వేరు. భవనంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు క్షణాల్లో పొగను బయటకు పంపేందుకు ఈ ఏర్పాటు చేశారు. భవనంలో 112 అడుగుల ఎత్తులో సుడిగాలి ఏర్పడుతుంది. అగ్నిప్రమాదం జరిగినప్పుడు మ్యూజియం ప్రధాన గోడల వెంట ఉన్న 144 అవుట్‌లెట్‌లు లోపలి ప్రాంగణంలోకి గాలిని పంపుతాయి. ఇది ఒక కృత్రిమ సుడిగాలిని ఉత్పత్తి చేస్తుంది. ఈ సుడిగాలి అగ్నిప్రమాదం వల్ల ఏర్పడిన పొగను తీసుకుంటూ భవనం పై భాగంలో ఉన్న ఎగ్జాస్ట్ ద్వారం గుండా బయటకు పంపుతుంది. ఈ క్రమంలో బయటకు వెళుతున్న పొగ టోర్నడోను తలపిస్తుంది. పొగ గిర్రున తిరుగుతూ అతి వేగంగా బయటకు వెళుతుంది. కొన్ని క్షణాల్లోనే భవనంలో ఉన్న పొగ మాయమవుతుంది. ఇలాంటి వ్యవస్థ ప్రపంచంలోనే మరెక్కడా లేదు. ప్రత్యేకంగా ఈ మ్యూజియం కోసమే ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే అత్యంత బలమైన కృత్రిమ టోర్నడోగా కూడా దీనికి గుర్తింపు ఉంది.

## సరిహద్దులో 'ఇల్లు'



సగం ఇల్లు ఒక దేశంలో, సగం మరో దేశంలో ఉందంటే! వినడానికే ఎంత తమాషాగా ఉంటుంది. ఇక చూస్తే ఎలా ఉంటుంది. అది చూడాలంటే మన దేశంలో నాగాలాండ్‌లోని 'లాంగ్వా' విలేజ్‌కి వెళ్లాల్సిందే.

లాంగ్వి విలేజ్ మయన్మార్ దేశ సరిహద్దులో ఉంటుంది. ఆ గ్రామ పెద్ద ఇల్లు సగం ఇండియాలో, సగం మయన్మార్‌లో ఉంటుంది. అంతేకాదు, ఈ గ్రామస్తుందరికీ ద్వంద్వ పౌరసత్వం అంటే ఇండియా పౌరసత్వంతో పాటు మయన్మార్ పౌరసత్వం ఉంటుంది. ఈ గ్రామంలో రెండు దేశాల సంస్కృతి, సంప్రదాయాలు కనిపిస్తాయి. జనాభా విషయానికొస్తే ఆరువందలకు పైగా ఉంటారు. వీరంతా ఎలాంటి ఆంక్షలు లేకుండా మయన్మార్‌కు వెళ్లివస్తుంటారు. అయితే భారత్‌లో జరిగే ఎన్నికల్లో మాత్రమే వీళ్ల ఓటు హక్కు వినియోగించుకుంటారు. వీరు గ్రామ పెద్దను అంగ్ అంటారు. భారత భూభాగంలో ఉన్న మూడు గ్రామాలు, మయన్మార్‌లో ఉన్న అయిదు గ్రామాలు అంగ్ నియంత్రణలో ఉంటాయి.

## అతివలకు హ్యాండ్‌బ్యాగ్ 'రక్షణ'



ఏదో పనిమీద బయటికి వెళ్లినప్పుడు చేతిలో ఉన్న ఫోన్ స్విచాఫ్ అవడమో, పనిచేయకపోవడమో జరిగినప్పుడు అప్పుడు ఉండే టెన్షన్ అంతా ఇంతా కాదు. అదే సందర్భంలో చేతికున్న హ్యాండ్‌బ్యాగ్ రక్షణగా నిలిస్తే ఎంత ఆనందంగా ఉంటుంది! అలాంటి హ్యాండ్ బ్యాగ్‌లు మార్కెట్‌లోకి వచ్చాయి మరి! అదే 'జిపిఎస్ ట్రాకర్ హ్యాండ్‌బ్యాగ్'. ఈ సౌకర్యాలున్న హ్యాండ్‌బ్యాగ్‌కు యాప్ ద్వారా కనెక్ట్ చేసుకుంటే మ్యాప్‌తో సమాచారం అప్‌డేట్ చేస్తూ ఉంటుంది. కొన్ని బ్యాగ్‌లలో ఎస్ఓఎస్ బటన్ ఆప్షన్ కూడా ఉంటుంది. ఎమర్జెన్సీ సమయాల్లో మెసేజ్ పంపుతుంది. యాంటీథెఫ్ట్ స్మార్ట్ బ్యాగుల్లో అయితే ఫింగర్ ప్రింట్ ఫీచర్ కూడా ఉంటుంది. ఇతరులు ఎవరైనా మన బ్యాగ్ తెరిచేందుకు ప్రయత్నిస్తే అలారం మోగుతుంది. సంగీతాన్ని ఆస్వాదించాలనుకునే వారికి మ్యూజిక్ వినిపించే బ్లూటూత్ స్పీకర్‌తో ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌లు కూడా మార్కెట్లు అందుబాటులో ఉన్నాయి.

చీకట్లో జిప్ తెరిస్తే లైట్ వచ్చే బ్యాగ్‌లు కూడా దొరుకుతున్నాయి. హ్యాండ్ బాగా మజాకా..! అన్నట్లుగా బ్యాగుల్లోని ఈ స్మార్ట్ ఫీచర్లన్నీ ఇప్పటి అమ్మాయిలకు ఎంతగానో ఉపయోగపడతాయనడంలో సందేహమే లేదు.

# రాయల్ సొసైటీకి ఫెలోగా డాక్టర్ సౌమ్య

ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సైంటిస్ట్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్, ప్రపంచంలోని అత్యున్నత శాస్త్ర గౌరవాలలో ఒకటైన **రాయల్ సొసైటీకి ఫెలోగా** ఎన్నికయ్యారు. ఆమె, 'భారతరత్న' భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె. భారతదేశం నుండి రాయల్ సొసైటీ ఫెలోలుగా ఎన్నికైన మొదటి తండ్రీ కూతుళ్ల ద్వయంగా డాక్టర్ సౌమ్య స్వామినాథన్, ఆమె తండ్రి నిలవడంతో, ఈ ఘనత భారతీయ విజ్ఞాన శాస్త్రంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. ప్రొఫెసర్ గగన్‌దీప్ కాంగ్ తర్వాత– 365 సం॥ చరిత్ర గల ఈ సొసైటీకి ఎన్నికైన రెండవ భారతీయ మహిళ సౌమ్య స్వామినాథన్ మాత్రమే.



**డా॥ సౌమ్య స్వామినాథన్:** ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే ప్రజారోగ్య నిపుణురాలైన డాక్టర్ సౌమ్య స్వామినాథన్, క్షయ, హెచ్ఐవి, కోవిడ్19 మహమ్మారి వంటి ప్రధాన ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవడంలో కీలక పాత్ర పోషించారు. రాయల్ సొసైటీకి ఆమె ఎన్నిక కావడం భారతీయ విజ్ఞానశాస్త్రానికి, అలాగే ప్రపంచ పరిశోధన, ఆరోగ్య సంరక్షణ నాయకత్వానికి దేశం అందిస్తున్న పెరుగుతున్న తోడ్పాటుకు ఒక గర్వకారణంగా పరిగణించబడుతోంది. ఈ గౌరవంతో, డా॥ సౌమ్య ప్రతిష్ఠాత్మక ఐజాక్ న్యూటన్ స్థాయి శాస్త్రవేత్తల సరసన చేరారు. 1973లోనే ఆమె తండ్రి, భారతరత్న ఎంఎస్ స్వామినాథన్ కూడా ఎఫ్ఆర్ఎస్‌గా ఎన్నికవడంతో, భారతదేశం నుండి ఎఫ్ఆర్ఎస్ పొందిన మొట్టమొదటి తండ్రీ కూతుళ్ల ద్వయంగా చెప్పవచ్చు.

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ **భారతదేశంలో హరిత విప్లవ పితామహుడిగా** ప్రసిద్ధి చెందారు. 1960వ దశకంలో భారతదేశం ఆహార ధాన్యాల కొరతతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఆయన అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను ప్రవేశపెట్టి, ఆహార కొరతతో ఉన్న దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించారు. ఆయన అమెరికన్ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్‌తో కలిసి పని చేసి, మన దేశ వాతావరణానికి సరిపోయే అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేశారు.ఆయన కృషి వల్ల భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి అనూహ్యంగా పెరిగింది. 1972–79 వరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా, అంతర్జాతీయ సంస్థలలో పలు ఉన్నత పదవులు నిర్వహించడంతో పాటు వ్యవసాయ రంగానికి చేసిన ఎనలేని సేవలకుగాను భారత ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను మరణానంతరం ప్రకటించి గౌరవించింది.

## వ్యాక్సిన్ అభివృద్ధి సహకారానికి డా॥ సౌమ్యకు ఫెలోషిప్ ప్రదానం

భారతదేశంలో వ్యాక్సిన్ అభివృద్ధికి, క్లినికల్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్‌లో శిక్షణా కార్యక్రమాల స్థాపనకు డా॥ సౌమ్య స్వామినాథన్ చేసిన కృషికి గుర్తింపుగా ఆమెకు ఈ ఫెలోషిప్ ప్రదానం చేయబడింది. ఆమె జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమానికి ప్రధాన సలహాదారుగా విధాన పరమైన దిశలను, దిద్దుబాటు చర్యలను సూచిస్తూ, క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యాలను సాధించే వ్యూహానికి నాయకత్వం వహిస్తున్నారు. కోవిడ్19 ఉధృతి సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థలో ప్రధాన శాస్త్రవేత్తగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) డైరెక్టర్ జనరల్‌గా కూడా పనిచేశారు.

లండన్‌లోని రాయల్ సొసైటీ (ఎఫ్ఆర్ఎస్) ఫెలోలుగా 40 మందికి పైగా భారతీయ శాస్త్రవేత్తలు, గణిత శాస్త్రజ్ఞులు ఎన్నికయ్యారు. భారతీయ మూలాలున్న శాస్త్రవేత్తలను/ భారత దేశంలో జన్మించిన లేదా పనిచేస్తున్న వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారా అనే దానిపై ఆధారపడి ఫెలోలుగా ఎన్నికైన మొత్తం సభ్యుల సంఖ్య మారుతుంది. ముంబై వాడియా వంశానికి చెందిన మెరైన్ ఇంజనీర్, నౌకా నిర్మాత అర్దసీర్ కర్సెట్జీ 1841లో ఎఫ్ఆర్ఎస్‌కు ఎన్నికైన మొదటి భారతీయుడు కాగా– 2026లో ఈ జాబితాలో చేరిన ఇటీవలి ప్రముఖులలో డా॥ సౌమ్య స్వామినాథన్, డా॥ మనింద్ర అగర్వాల్ ఉన్నారు. భారతదేశంలో పనిచేస్తూ లండన్‌లోని రాయల్ సొసైటీకి ఎన్నికైన మొదటి మహిళా శాస్త్రవేత్త కాగా డా॥ సౌమ్య స్వామినాథన్ (2026): ప్రముఖ క్లినికల్ శాస్త్రవేత్త, ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సైంటిస్ట్. మనింద్ర అగర్వాల్ కంప్యూటర్ శాస్త్రవేత్త, ఐఐటి కాన్పూర్ డైరెక్టర్.

డా॥ సౌమ్య స్వామినాథన్, భారతరత్న ఎంఎస్ స్వామినాథన్ రాయల్ సొసైటీ ఫెలోషిప్ పొందిన మొదటి భారతీయ తండ్రీకూతుళ్ల ద్వయంగా చరిత్ర సృష్టించడంతో పాటు భారతదేశ ఖ్యాతిని ప్రపంచ యవనికపై ఇనుమడింపచేసిన వీరి కృషి భారతీయులందరికీ ప్రేరణాదాయకంగా నిలుస్తుంది.

– యేచన్ చంద్ర శేఖర్

కథ

# మూడో కన్ను

భూక్యా గోపినాయక్

**శ్రీనివాసరావు మాస్టారికి నలభై ఎనిమిది ఏళ్లు. ఆయన చేతివేళ్లకు చాక్‌పీస్ వాసన, ఆయన గొంతుకు తరగతి గది ప్రతిధ్వని అలవాటైపోయాయి.**

చిత్తూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో గడిచిన ఇరవై ఏళ్లుగా ఆయన సోషల్ పాఠాలు చెప్తున్నారు. ఆయన కారిడార్‌లో నడిచి వస్తుంటే, గాలి కూడా నిశ్శబ్దంగా కదులుతుందేమో అనిపిస్తుంది పిల్లలకు. 'మాస్టారు' అనే పిలుపు ఆయన పేరులో భాగం కాదు, ఆయన అస్తిత్వంలో భాగం. ఆ గౌరవం అనే గొడుగు నీడన, ఆయన తన మధ్య తరగతి జీవితాన్ని ఏ ఒడిదొడుకులూ లేకుండా ఒక పద్ధతి ప్రకారం అమర్చుకున్నారు. ఇల్లాలు కమల, ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకు, ఇంటర్ చదువుతున్న కూతురు. వాళ్ల చదువుల ఫీజులు, ఇంటి అద్దె, నెలసరి ఖర్చులు... అన్నీ ఆయన జీతంతోనే సాఫీగా సాగిపోతున్నాయి. ఆయన ప్రపంచం చిన్నదే కావచ్చు, కానీ అందులో ప్రశాంతతకు కొదవలేదు.

ఆ ప్రశాంతమైన జీవన సరస్సులో ఒక రోజు ఎవరో పెద్ద రాయి విసిరినట్లయింది. స్కూల్ కరస్పాండెంట్, ఆయన్ని తన గదికి పిలిపించారు. ఆ ఏసీ గదిలోని చల్లదనం కూడా ఆయనలోని ఆందోళనను తగ్గించలేకపోయింది.

"మాస్టారూ, మీరు మా సంస్థకు చేసిన సేవ మరువలేనిది. కానీ విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, మేం మా స్కూల్‌ను ఆధునీకరిస్తున్నాం. టెక్నాలజీ ఆధారిత విద్యను ప్రవేశపెడుతున్నాం. ఈ మార్పులను యువతరం ఉపాధ్యాయులు త్వరగా అందిపుచ్చుకుంటారని మా మేనేజ్‌మెంట్ నమ్మకం. అందుకే, విచారంగా ఉన్నా, మీలాంటి సీనియర్ల సేవలను ఇకపై కొనసాగించలేకపోతున్నాం" అని చెబుతూ, మూడు నెలల జీతం ఉన్న కవరును ఆయన ముందు పెట్టారు.




ఆ మాటలు సున్నితంగా ఉన్నా, వాటి వెనుక ఉన్న కఠినమైన నిజం శ్రీనివాసరావు గుండెను తాకింది. "పనితీరు బాగాలేదు" అని ముఖం మీద చెప్పే ధైర్యం లేక, 'టెక్నాలజీ' అనే ముసుగు వేశారని ఆయనకు అర్థమైంది. ఇరవై ఏళ్ల తన అనుభవం, అంకితభావం, యాభైకి దగ్గరవుతున్న వయసు... అన్నీ ఒక్క క్షణంలో అనర్హతలుగా ముద్రపడ్డాయి. ఆ అవమాన భారం ఆయన భుజాల మీద పెద్ద బండలా పడింది.

ఇంటికి వచ్చి కమలతో విషయం చెప్పినప్పుడు, ఆమె కళ్లల్లో మెరిసిన భయం, ఆందోళన ఆయన ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీశాయి. "ఏమండీ, ఇప్పుడెలా? పిల్లల ఫీజులు దగ్గర పడుతున్నాయి" ఆమె గొంతులో భవిష్యత్తు గురించిన భయం వణికింది. "నువ్వేం కంగారు పడకు. నా లాంటి అనుభవం ఉన్న టీచర్‌కు ఉద్యోగం దొరకదా? పది రోజుల్లో ఇంతకన్నా మంచి స్కూల్‌లో చేరతాను చూడు" అని పైకి ధైర్యం చెప్పారే కానీ, ఆయన మనసులో అదే ప్రశ్న సుడిగుండంలా తిరుగుతోంది.

ఆయన అనుకున్నంత సులువుగా ఏదీ జరగలేదు. చిత్తూరులోని ప్రతి ప్రైవేట్ స్కూల్ తలుపు తట్టారు. అందరూ ఆయన అనుభవాన్ని, బోధనా పటిమను మెచ్చుకున్నారు, కానీ ఉద్యోగం దగ్గరికి వచ్చేసరికి మొహం చాటేశారు.

"మాస్టారూ, మీకివ్వాల్సిన జీతంతో ఇద్దరు యంగ్ టీచర్లను పెట్టుకోవచ్చు కదా" అని ఒక స్కూల్ ప్రిన్సిపాల్ దాపరికం లేకుండా అనేశాడు. వయసు, జీతం ఆయనకు పెద్ద శత్రువులయ్యాయి.

నెలలు గడిచాయి. బ్యాంకు ఖాతాలో దాచుకున్న డబ్బులు నెమ్మదిగా కరిగిపోతున్నాయి. కొడుకు కాలేజీ నుండి ఫీజు కట్టమని రిమైండర్ వచ్చింది. శ్రీనివాసరావులో నిస్సహాయత, నిరాశ గూడు కట్టుకున్నాయి. పగలు ఉద్యోగ వేటలో తిరిగి, రాత్రిళ్లు ఇంట్లో కుమిలిపోతున్నారు. తనను తాను ఒక విఫలమైన తండ్రిగా, భర్తగా చూసుకోవడం మొదలుపెట్టారు.

ఒక రోజు రాత్రి, అందరూ పడుకున్నాక, చీకటి గదిలో ఒంటరిగా కూర్చుని ఫోన్ చూస్తుండగా 'స్పీడీ ఈట్స్' డెలివరీ యాప్ ప్రకటన కనిపించింది.

"మీరే బాస్. మీరే ఎంప్లాయీ. రోజుకు వెయ్యి రూపాయల వరకు సంపాదించండి" ఆ అక్షరాలు ఆ చీకట్లో వెలుగులా కనిపించాయి. కానీ, ఆ ఆలోచన రాగానే సిగ్గు, అవమానం ఆవరించాయి. "నేనా? వందల మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన నేను, ఇప్పుడు హోటళ్ల నుండి టిఫిన్ పొట్లాలు మోయాలా? నా విద్యార్థులు ఎవరైనా చూస్తే నా పరువేం కావాలి?" ఆయన మనస్సాక్షి తీవ్రంగా ఘోషించింది. కానీ, మరోవైపు కుటుంబ బాధ్యతలు భూతంలా భుజాల మీద కూర్చుని నొక్కుతున్నాయి. ఆ రాత్రంతా నిద్రలేని సంఘర్షణ. చివరికి, అవసరాల ముందు ఆయన ఆత్మాభిమానం తలవంచక తప్పలేదు.

తెల్లవారే.. ఎవరికీ చెప్పకుండా, తన పాత స్కూటర్‌ను అమ్మగా వచ్చిన డబ్బుతో ఒక సెకండ్ హ్యాండ్ బైక్ కొన్నాడు. 'స్పీడీ ఈట్స్' ఆఫీసుకు వెళ్లి డెలివరీ ఏజెంట్‌గా చేరాడు. నీలం రంగు టీషర్ట్, భుజానికి ఒక పెద్ద బ్యాగ్. ఆ యూనిఫామ్ ఆయన పాత గుర్తింపును చెరిపేసి, కొత్త వాస్తవాన్ని ముఖం మీద కొట్టినట్లుంది. ఇంట్లో, తనకు ఒక పెద్ద సూపర్ మార్కెట్‌లో సూపర్‌వైజర్ ఉద్యోగం దొరికిందని, అక్కడ షిఫ్టుల ప్రకారం పని చేయాలని అబద్ధం చెప్పారు. ఆయన భార్య కమల మొదట సంతోషించినా, ఆయన ప్రవర్తనలో వచ్చిన మార్పును, ఆయన కళ్లలోని వెలితిని గమనిస్తూనే ఉంది.

శ్రీనివాసరావు కొత్త జీవితం మొదలైంది. ఆయన ప్రపంచం ఒక్కసారిగా తలకిందులైంది. ఒకప్పుడు తరగతి గదిలో నిలబడి సామ్రాజ్యాల గురించి, స్వాతంత్ర్య పోరాటాల గురించి పాఠాలు చెప్పిన ఆయన, ఇప్పుడు చిత్తూరు గల్లీలలో,

**"ఏమండీ, ఆ సూపర్‌వైజర్ ఉద్యోగం మీకు నచ్చినట్లు లేదు. రోజూ ఏదో యుద్ధం చేసి వచ్చినట్లు అలసిపోతున్నారు" అని కమల ఒక రోజు అంది. "అదేం లేదు, పని ఒత్తిడి" అని సమాధానం దాటవేశారు.**

ట్రాఫిక్ మధ్య తిండి పొట్లాలను మోస్తున్నారు. చిత్తూరు పట్టణం ఆయనకు కొత్తగా పరిచయమవుతోంది. ఆయనకు తెలియని సందులు, గొందులు, ఆయన ఎప్పుడూ చూడని జీవితాలు.

మొదట్లో ప్రతి క్షణం నరకంలా ఉండేది. హోటళ్ల ముందు గంటల తరబడి వేచి చూడటం, కస్టమర్ల నుండి అకారణంగా తిట్లు తినడం, యాప్‌లోని టైమర్‌తో పోటీ పడుతూ బైక్ నడపడం... అన్నీ ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవే. ఒకసారి, ఆయన పాఠాలు చెప్పిన ఒక పాత విద్యార్థి ఇంటికే డెలివరీకి వెళ్లాల్సి వచ్చింది. ఆ ఇంటి ముందు నిలబడి, కాలింగ్ బెల్ కొట్టడానికి ఆయన చేతులు రాలేదు. గుండె వేగంగా కొట్టుకుంది. ఆ ఆర్డర్‌ను మరో ఏజెంట్‌కు బదిలీ చేసి, ఆ రోజు పని మానేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆ భయం, ఆ అవమానం ఆయన్ని నీడలా వెంటాడుతూనే ఉన్నాయి.

ఆయనలో ఆయనకే తెలియని మార్పు మొదలైంది. ఇంట్లో తక్కువగా మాట్లాడటం, అందరి నుండి దూరంగా ఉండటం. కమల ఏదైనా అడిగితే చిరాకుపడటం. "ఏమండీ, ఆ సూపర్‌వైజర్ ఉద్యోగం మీకు నచ్చినట్లు లేదు. రోజూ ఏదో యుద్ధం చేసి వచ్చినట్లు అలసిపోతున్నారు" అని కమల ఒక రోజు అంది. "అదేం లేదు, పని ఒత్తిడి" అని సమాధానం దాటవేశారు. వాళ్ల మధ్య మాటల దూరం పెరుగుతోంది.

ఆ రోజు చిత్తూరులో కుండపోత వర్షం. రాత్రి పది గంటల సమయం. శ్రీనివాసరావుకు ఒక ఆర్డర్ వచ్చింది. వర్షంలో తడుస్తూ, ఆ ఆర్డర్ తీసుకుని డెలివరీ అడ్రస్‌కు బయలుదేరారు. దారి మధ్యలో, నీళ్లు నిలిచిన ఒక గుంతలో బైక్ ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ అవ్వలేదు. అప్పటికే కస్టమర్ ఫోన్ చేసి తిట్టడం మొదలుపెట్టాడు. "ఇంకా రాలేదేం? ఫుడ్ చల్లారిపోతే డబ్బులు ఇచ్చేది లేదు" అని అరుస్తున్నాడు.

అదే సమయంలో, కమల ఫోన్ చేసింది. "ఏమండీ, ఇంకా రాలేదేం? వర్షం పెద్దగా పడుతోంది. కంగారుగా ఉంది" ఆమె గొంతులో ఆందోళన.

ఒకేసారి కస్టమర్ అరుపులు, భార్య ఆందోళన, చలికి వణుకుతున్న శరీరం, ఆగిపోయిన బండి... అన్నీ కలిసి శ్రీనివాసరావులోని నిగ్రహాన్ని పటాపంచలు చేశాయి. ఆయన ఫోన్‌లోనే, కమల ముందు, మొదటిసారిగా ఒక చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చేశారు. "నన్ను క్షమించు కమలా, నేను నీకు అబద్ధం చెప్పాను. నాకు ఏ సూపర్‌వైజర్ ఉద్యోగం రాలేదు. నేను... నేను ఫుడ్ డెలివరీ చేస్తున్నాను" అని చెప్పేశారు.

ఆ రాత్రి, వర్షంలో తడిసిన బండిని నెట్టుకుంటూ ఇంటికి వెళ్లేసరికి, కమల గుమ్మంలోనే నిలబడి ఉంది. ఆమె కళ్లల్లో కోపం లేదు, నింద లేదు. చెప్పలేని బాధ, జాలి నిండిన చూపు. లోపలికి రాగానే, ఆమె ఒక్క మాట కూడా మాట్లాడకుండా, ఆయన తల తుడిచి, వేడి నీళ్లు పెట్టి, వేడి వేడి అన్నం తినిపించింది. ఆ స్పర్శలో, ఆ సేవలో, ఆయనకు తన మీద తనకే పోయిన గౌరవం తిరిగి దొరికినట్లు అనిపించింది. ఆ రాత్రి, వాళ్ల మధ్య ఉన్న అబద్ధమనే గోడ కూలిపోయింది.

నిజం బయటపడ్డాక, భయం పోయింది. అవమానం స్థానంలో ఒక కొత్త ధైర్యం వచ్చింది. మరుసటి రోజు ఉదయం, శ్రీనివాసరావు ఆ నీలం రంగు టీషర్ట్ వేసుకుంటుంటే, కమల వచ్చి, "ఈ రోజు నుండి, మీరు తలదించుకుని కాదు, తలెత్తుకుని ఈ పని చేయండి. ఏ పనైనా పనే. మన కుటుంబాన్ని పోషించే ప్రతి పనీ గొప్పదే" అంది.

ఆ మాటలు ఆయనకు కొండంత బలాన్నిచ్చాయి. ఆ రోజు నుండి, శ్రీనివాసరావులో కొత్త మనిషి పుట్టాడు. ఆయన ఇకపై సిగ్గుపడటం లేదు. ప్రతి డెలివరీని ఒక కొత్త పాఠంలా చూడటం మొదలుపెట్టారు. ఆయన మూడో కన్ను తెరుచుకున్నట్లుగా, మనుషులను, సమాజాన్ని కొత్త కోణంలో చూడటం ప్రారంభించారు.

ఒక పెద్ద బంగ్లాకు పిజ్జా డెలివరీకి వెళ్లినప్పుడు, అక్కడ పుట్టినరోజు జరుపుకుంటున్న ఒక పిల్లాడి ఒంటరితనాన్ని గమనించారు. ఒక అపార్ట్‌మెంట్‌కు మెడిసిన్ డెలివరీకి వెళ్లినప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధ దంపతుల నిస్సహాయతను చూశారు. ఒక హాస్టల్‌కు బిర్యానీ డెలివరీకి వెళ్లినప్పుడు, ఊరిని వదిలి వచ్చిన కుర్రాళ్ల ఆశలను, ఆందోళనలను వాళ్ల కళ్లల్లో చదివారు. ఆయనకు అర్థమైంది, తను కేవలం తిండి పొట్లాలను మోయడం లేదని, ఆకలితో పాటు ఆశలను, ఆనందాలను, అవసరాలను కూడా డెలివరీ చేస్తున్నానని.

ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. కస్టమర్లతో చిరునవ్వుతో మాట్లాడటం, వాళ్ల పిల్లలను పలకరించడం, వృద్ధులకు సహాయం చేయడం మొదలుపెట్టారు. ఆయన యాప్‌లో కస్టమర్ రేటింగ్స్ పెరిగాయి. "చాలా మంచి మనిషి" అని కామెంట్లు రావడం మొదలైంది.

ఒక రోజు, ఆయన ఒక పెద్ద వ్యాపారవేత్త ఇంటికి డెలివరీకి వెళ్లారు. ఆ ఇంటి యజమాని కొడుకు, పదో తరగతి చదువుతున్నాడు. ఆ అబ్బాయి శ్రీనివాసరావును చూసి గుర్తుపట్టాడు. "సార్, మీరు శ్రీనివాసరావు మాస్టారు కదా! మా కజిన్ వాళ్ల స్కూల్‌లో సోషల్ టీచర్ కదా!" అన్నాడు ఆశ్చర్యంగా.

శ్రీనివాసరావు ఒక్క క్షణం తడబడినా, వెంటనే తేరుకుని, "అవును బాబూ, ఒకప్పుడు. ఇప్పుడు ఇది నా ఉద్యోగం" అని నవ్వుతూ చెప్పారు.



ఆయనలోని నిజాయితీకి, ఆ ఆత్మవిశ్వాసానికి ఆ వ్యాపారవేత్త ముగ్ధుడయ్యాడు. తన కొడుకు సోషల్‌లో చాలా వెనుకబడి ఉన్నాడని, శ్రీనివాసరావు లాంటి అనుభవజ్ఞుడైన మాస్టారు ట్యూషన్ చెప్తే బాగుంటుందని అడిగాడు.

అది ఒక కొత్త ఆరంభం. ఆ వ్యాపారవేత్త ద్వారా, మరో నలుగురు పెద్ద వాళ్ల పిల్లలకు ట్యూషన్లు చెప్పే అవకాశం వచ్చింది. ఆయనకు టీచర్‌గా పునర్జన్మ లభించింది. ఇప్పుడు ఆయనకు స్కూల్ ఉద్యోగం కన్నా ఎక్కువ సంపాదన, అంతకు మించిన గౌరవం దొరుకుతున్నాయి.

శ్రీనివాసరావు ఇప్పుడు ట్యూషన్లు చెప్తున్నారు. కానీ, ఆయన ఆ డెలివరీ ఉద్యోగాన్ని పూర్తిగా మానలేదు. ఆదివారాల్లో, ఖాళీ సమయాల్లో, ఆ నీలం రంగు టీషర్ట్ వేసుకుని, చిత్తూరు వీధుల్లో తిరుగుతూనే ఉన్నారు. "ఎందుకండీ, ఇప్పుడు ఈ కష్టం మనకు అవసరం లేదు కదా!" అని కమల అంటే–

ఆయన నవ్వి, "ఇది కష్టం కాదు కమలా. ఇది నన్ను నాకు పరిచయం చేసిన ఉద్యోగం. సమాజం అనే పుస్తకాన్ని నాకు కళ్లకు కట్టినట్లు చూపించిన బడి. ఈ బడిని నేను వదలను. నా మూడో కన్ను ఎప్పుడూ తెరిచే ఉండాలి" అంటారు.

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర బండి ఆపి, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూస్తుంటే, శ్రీనివాసరావుకు ఇప్పుడు ఏసీ క్లాస్‌రూమ్‌లో పాఠాలు చెప్పినప్పటి కన్నా ఎక్కువ సంతృప్తిగా ఉంది. జీవితంలో కొన్నిసార్లు, మనం కింద పడితేనే, భూమి ఎంత విశాలమైనదో, ఆకాశం ఎంత ఎత్తైనదో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన తన గౌరవాన్ని, హోదాను కోల్పోయి, అంతకు మించిన ఆత్మగౌరవాన్ని, జీవిత సత్యాన్ని సంపాదించుకున్నారు. ■

## అరుదైన పుస్తకాలు

### ఆక్సిరింకస్ పాపిరి: సామాన్యుల జీవితానికి చెత్తలో దొరికిన సాక్ష్యం

సాధారణంగా పురావస్తు శాస్త్రవేత్తలు రాజభవనాలు లేదా సమాధుల కోసం వెతుకుతారు. కానీ, 1897లో బ్రిటిష్ శాస్త్రవేత్తలు బెర్నార్డ్ గ్రెన్ఫెల్, ఆర్థర్ హంట్ ఈజిప్టులోని 'ఆక్సిరింకస్' అనే ప్రాంతంలోని పురాతన చెత్త కుప్పలను తవ్వాలని నిర్ణయించుకున్నారు. లోకం దృష్టిలో అది వ్యర్థం కావొచ్చు, కానీ చరిత్రకారుల దృష్టిలో అది సమాచార గని. అక్కడ వారికి లక్షలాది పాపిరస్ (కాగితం వంటి పత్రం) ముక్కలు లభించాయి. అందులో పన్ను రికార్డులు, ప్రేమికులు రాసుకున్న ఉత్తరాలు, వ్యాపార ఒప్పందాలు, కూరగాయల జాబితాలు, ప్రాచీన కవితలు ఉన్నాయి. ఇవి రాజుల చరిత్రను కాకుండా, నాటి సాధారణ ప్రజల దైనందిన జీవితాన్ని కళ్లకు కట్టాయి. సామాన్యులు ఎలా బతికారు? వారు ఏయే వస్తువులు కొన్నారు? వారి కష్టాలేమిటి? వంటి విషయాలు ఈ పత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. అంతేకాకుండా, గ్రీకు సాహిత్యంలో కనుమరుగైపోయిన అనేక నాటకాలు, కవితలు కూడా ఈ చెత్త కుప్పల్లోనే దొరికాయి. చరిత్ర అంటే కేవలం యుద్ధాలు, కిరీటాలు మాత్రమే కాదు, సామాన్యుడి చిరునామా కూడా అని ఈ 'ఆక్సిరింకస్ పాపిరి' నిరూపించింది.

– రవికుమార్

# అవివాహితుల్లో పెరుగుతున్న క్యాన్సర్ !

**ఆధునిక** డిజిటల్ యువత ఆలోచల్లో విపరీత ధోరణులు పెరుగుతున్నాయి. వివాహాలు వద్దంటూ నూతన నినాదాలు, విడాకులతో ఒంటరి సంసారాలు, ఆలస్యముగా వివాహాలు, దాంపత్య జీవితాల్లో అశాంతులు రోజురోజుకు పెరుగుతున్నాయి. "సోలో బతుకు సో బెటరు" అంటూ ప్రవర్తిస్తున్నారు. సింగిల్‌గా బతుకుతున్న యువతలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నట్లు ఇటీవల విడుదలైన శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

## అధిక క్యాన్సర్ ముప్పు

పెళ్లిళ్లు చేసుకోని పురుషుల్లో 68 శాతం, అవివాహిత మహిళల్లో 83 శాతం వరకు క్యాన్సర్ రేట్లు అధికంగా ఉన్నట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పెళ్లికి, వ్యక్తిగత ఆరోగ్యానికి సంబంధం ఉన్నట్లు నిర్ధారించారు. యూనివర్సిటీ ఆఫ్ మియామీ మిల్లర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ చెందిన డా॥ పాలో ఎస్.పెన్‌హీరో చేసిన అధ్యయనం ఈ అంశాల పట్ల లోతైన పరిశోధనలు చేసి ఫలితాలను పరిశోధనా వ్యాసం రూపంలో ప్రచురించారు. 2015-22 మధ్య జరిగిన ఈ అధ్యయనంలో అమెరికాకు చెందిన 12 రాష్ట్రాలకు చెందిన 4 మిలియన్ల క్యాన్సర్ కేసులను పరిగణనలోకి తీసుకున్నారు. వివాహిత యువతతో పోల్చితే పెళ్లిళ్లు కాని యువతలో క్యాన్సర్ ముప్పు అధికంగా కనిపిస్తున్నట్లు తేల్చారు. అవివాహితుల్లో వయస్సు పెరిగినకొద్దీ ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. వివాహాల వల్ల భావోద్వేగ సమతుల్యత, సామాజిక మద్దతు, భాగస్వాముల మధ్య పరస్పర ఆరోగ్య శ్రద్ధ లాంటి అంశాల ఫలితంగా క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్లు వివరిస్తున్నారు. అవివాహితులతో పోల్చితే వివాహిత యువతలో పొగ తాగడం, ఆల్కహాల్ సేవనం లాంటి దురలవాట్లు తక్కువగా ఉండడం వల్ల వారిలో క్యాన్సర్ కేసుల రేటు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. వివాహాలతో వ్యక్తుల్లో ఓవర్ ఆల్ వెల్ బీయింగ్/ సంపూర్ణ ఆరోగ్య శ్రేయస్సుకు సంరక్షణ జరుగుతున్నట్లు తెలుస్తున్నది. అవివాహిత పురుషుల కన్నా అవివాహిత స్త్రీలల్లో క్యాన్సర్ ముప్పు అధికంగా కనిపించడం ఒక ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. వీళ్లలో గర్భాశయ, ఎండోమెట్రిక్ క్యాన్సర్ ముప్పు అధికంగా ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు. సామాజిక మానవ సంబంధాలు (కుటుంబం, బంధుమిత్రులు, పౌర సమాజం, సాధు జంతువులతో గడపడం) కూడా ఆరోగ్యాన్ని అధికంగా ప్రభావితం చేస్తున్నట్లు తెలుస్తున్నది. వివాహితుల్లో వైద్య ఆరోగ్య సంరక్షణలు, జీవితకాల ఆరోగ్య భద్రత చర్యలు ఎక్కువగా ఉంటున్నాయని గమనించారు. అవివాహిత స్త్రీ పురుషుల్లో ఆరోగ్యం పట్ల అనవసర అపోహాలు ఉండడంతో వారిలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నట్లు గమనించారు. అవివాహిత స్త్రీ పురుషులు అధిక ఆరోగ్యకర సామాజిక పౌర సంబంధాలు, క్రమ పద్ధతిలో వైద్య పరీక్షలు, ఆరోగ్యకర జీవనశైలి లాంటి అంశాలను పాటిస్తే ఆరోగ్యం బాగుంటుందని సూచిస్తున్నారు.



## అసంబద్ధ జీవనశైలి..

మూడు పదుల వయస్సు దాటిన వివాహిత యువతతో పోల్చితే అవివాహిత యువతలో క్యాన్సర్ ముప్పు అధికంగా గమనించిన కారణంగా పెళ్లిళ్లు చేసుకోమంటూ భీష్మించుకొన్న వారు సరైన వయస్సులో ఏడడుగులు వేసి పెళ్లంటే నూరేళ్ల ఆనందాల పంట అని రుజువు చేయాలి. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా వెళితే అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధులు వెంటపడతాయని తెలుసుకోవాలి. పొగాకు, ఆల్కహాల్, అధిక బరువు, శారీరక వ్యాయామ లోపాలు, గాలి కాలుష్యం, యూవీ రేడియేషన్ కారణ క్యాన్సర్లను తగు జీవనశైలి మార్పులతో తప్పించుకోవచ్చని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇటీవల ఐరాస అధ్యయనాల ప్రకారం, జీవనశైలి మార్పులతో 37 శాతం క్యాన్సర్ కేసులు నివారించుకోవచ్చని తేల్చిన విషయం గమనార్హం. నివారించగల క్యాన్సర్ కేసుల్లో 45 శాతం పురుషులు, 30 శాతం స్త్రీలు ఉన్నట్లు తెలుస్తున్నది.

మహిళలతో పోల్చితే పురుషుల్లో పొగాకు, ఆల్కహాల్ సేవనాలు.. లాంటి దురలవాట్లు అధికంగా ఉండడంతో క్యాన్సర్ ముప్పు పురుషుల్లో ఎక్కువగా కనిపిస్తున్నది. అస్తవ్యస్త జీవనశైలి, వైద్య ఆరోగ్య సంరక్షణ చర్యల్లో అశ్రద్ధల వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నందున నేటి డిజిటల్ కాలపు యువత యుక్త వయస్సు రాగానే పెళ్లిళ్లు చేసుకొని సుఖ సంసారాలతో కుటుంబ ఆనందాలను ఆస్వాదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏ వయస్సులో జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరగాలి. యువత ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ వైవాహిక జీవిత ఆనంద సుగంధాలను ఆస్వాదించాలని, ఆరోగ్యకర సంతానం రూపంలో రేపటి తరానికి పునాదులు వేయాలని కోరుకుందాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

# సౌభాగ్య సిరికి ప్రతీక.. గాజులు



**భారతీయ** సంస్కృతిలో స్త్రీలు గాజులు ధరించడం వెనుక కేవలం బాహ్య సౌందర్యమే కాదు, ఆధ్యాత్మిక, సామాజిక, శాస్త్రీయ కారణాలు కూడా ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి గాజులను మంగళప్రదమైన ఆభరణంగా, సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తున్నారు. హిందూ సంప్రదాయంలో వివాహిత స్త్రీలకు ఐదవతనం(సౌభాగ్యం) ఇచ్చే చిహ్నాలలో గాజులు అత్యంత ముఖ్యమైనవి. పండుగలు, వివాహాలు, సీమంతం (గాజుల పండుగ) వంటి శుభకార్యాలలో గాజులు తొడగడం ఒక పవిత్రమైన ఆచారంగా వస్తోంది. భారతదేశంలో గాజుల చరిత్ర సుమారు 5000 యేళ్ల క్రితం సింధు లోయ నాగరికత నుండే మొదలైంది. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో రాగి, వెండి గాజులతో పాటు టెర్రకోట (కాల్చిన మట్టి)తో చేసిన గాజులు కూడా లభించాయి.

### గాజుల రంగుల వెనుక విశిష్టత

గాజుల రంగులు అలంకరణ కోసమే కాదు, ఒక్కో రంగుకు ఒక్కో విశిష్టత ఉంది. ఆకుపచ్చ గాజులు ప్రగతికి, శాంతికి, సంతాన ప్రాప్తికి చిహ్నం. ముఖ్యంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి ప్రాంతాలలో వివాహితలు ఆకుపచ్చ గాజులను ఎక్కువగా ధరిస్తారు. ఎరుపు గాజులు శక్తికి, ప్రేమకు, పవిత్రతకు ప్రతీక. ఉత్తర భారతదేశంలో పెళ్లికూతురు చూడా పేరుతో పిలిచే ఎరుపు రంగు గాజులను తప్పనిసరిగా ధరిస్తుంది. పసుపు గాజులు సంతోషానికి, సమృద్ధికి చిహ్నం.

### శాస్త్రీయ ఆరోగ్య కోణం

గాజులు ధరించడం వెనుక అద్భుతమైన ఆరోగ్య రహస్యం కూడా దాగి ఉంది. చేతి మణికట్టు భాగంలో శరీరానికి సంబంధించిన ముఖ్యమైన ప్రెషర్ పాయింట్స్ (అక్యుప్రెషర్ పాయింట్లు) ఉంటాయి. గాజులు నిరంతరం మణికట్టుపై ఘర్షణ కలిగించడం వల్ల ఆ భాగంలో రక్తప్రసరణ రేటు పెరుగుతుంది. చేతి నుండి వెలువడే విద్యుత్ అయస్కాంత శక్తి బయటకు పోకుండా, గుండ్రని గాజుల తాకిడి వల్ల తిరిగి శరీరంలోకే ప్రవహిస్తుందని, దీనివల్ల అలసట తగ్గుతుందని చాలామంది నమ్ముతారు. గర్భిణీ స్త్రీలకు 'సీమంతం' చేసి చేతులకు నిండుగా మట్టి గాజులు వేస్తారు. దీని వెనుక ఒక మానసిక, శాస్త్రీయ కోణం ఉంది. మట్టి గాజుల నుండి వచ్చే మధురమైన 'కిలకిల' శబ్దాలు గర్భంలో ఉన్న శిశువు శ్రవణేంద్రియాలను (వినే శక్తిని) ఉత్తేజపరుస్తాయి. ఈ శబ్దాలు తల్లి మనసుకు ప్రశాంతతను, పుట్టబోయే బిడ్డకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయని వైద్యశాస్త్రం కూడా అంగీకరిస్తుంది. మట్టి గాజుల నాదం చుట్టుపక్కల ఉన్న నెగటివ్ శక్తిని దూరం చేసి, ఇల్లాలు నడుస్తున్నప్పుడు ఇల్లంతా పాజిటివ్ శబ్ద తరంగాలను నింపుతుందని పెద్దలు చెబుతారు. ఆ శబ్దం ఇంట్లో ప్రశాంత వాతావరణాన్ని తెస్తుంది. భారతీయ సంప్రదాయంలో గాజులు కేవలం ఒక వస్తువు కాదు. అది స్త్రీ ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని, కుటుంబ సంక్షేమాన్ని ప్రతిబింబించే అద్భుతమైన ఒక జీవనసూత్రం.

### కోట్ల రూపాయల వ్యాపారం

అనునిత్యం భారతీయ స్త్రీలు ధరించే బంగారు, వెండి, గాజు, లక్క, ఫ్యాషన్, రాళ్ల గాజులు ఇత్యాది వాటి వ్యాపారం కోట్లల్లో ఉంటుందంటే ఆశ్చర్యం కలగక మానదు. భారతీయ జనాభాలో మహిళలు కూడా కోట్ల సంఖ్యలో ఉండటం వల్ల ప్రతి ఒక్కరూ పలురకాల గాజులు తీసుకోవడం వల్ల వ్యాపారం కూడా కోట్ల రూపాయలలోనే ఉంటుంది. బంగారం, వెండి, కుందన్ గాజులు వివాహాలు, పండుగల సీజన్లలో కొనుగోలు చేస్తుంటారు. నిత్యం స్త్రీలు ధరించే ఫిరోజాబాద్ మట్టిగాజుల వ్యాపారం దేశవ్యాప్తంగా రెండు వేల కోట్ల వరకు ఉంటుంది. లాక్ (లక్క), మెటల్, ఫ్యాన్సీ, ట్రెడ్ గాజుల వ్యాపారం పది కోట్ల వరకు ఉంటుందని అంచనా. జైపూర్‌లో లాక్ (లక్క) గాజుల పరిశ్రమ ఉంది. ఇక్కడ కూడా వ్యాపారం కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. శ్రావణమాసం, దసరా, దీపావళి, కార్తికమాసం, ఉత్తర భారతదేశంలో జరుపుకునే 'కర్వాచౌత్' వంటి పండుగల సమయంలో గాజుల అమ్మకాలు రెండు వందల శాతం వరకు పెరుగుతాయి. మట్టి గాజులు త్వరగా పగిలిపోయే స్వభావం కలిగి ఉండటం వల్ల స్త్రీలు వీటిని తరచూ కొనుగోలు చేస్తూనే ఉంటారు. అందువల్ల మార్కెట్‌లో వీటికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఆ కారణంగా అనేక ప్రాంతాలలో పలు రకాల మట్టి గాజులు తయారు చేసే కార్ఖానాలు ఆవిర్భవించాయి. భారతదేశంలో కొన్ని ప్రాంతాలు కొన్ని ప్రత్యేకమైన గాజుల తయారీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

### భారతదేశంలో గాజుల తయారీ కేంద్రాలు

ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ భారతదేశ గాజు..

నగరంగా ప్రసిద్ధి చెందింది. ఫిరోజాబాద్‌లో గాజుల తయారీ ప్రారంభం మొఘల్ రాజుల కాలంలో జరిగింది. ముఖ్యంగా అక్బర్ పాలనలో గాజు పరిశ్రమ అభివృద్ధి చెందింది. రాజ కుటుంబాలు, మహిళలు గాజులను అలంకారంగా ఎక్కువగా ఉపయోగించడం వల్ల డిమాండ్ పెరిగింది. బ్రిటిషు పాలనలో కొన్ని యంత్ర పద్ధతులు వచ్చినప్పటికీ ఫిరోజాబాద్‌లో సంప్రదాయ చేతిపని విధానం కొనసాగింది. నేడు మట్టి గాజుల తయారీకి ఫిరోజాబాద్ ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రం. ఇక్కడి గాజు పరిశ్రమ కొన్ని శతాబ్దాల నాటిది. దేశవ్యాప్తంగా సరఫరా అయ్యే రంగురంగుల, మెరిసే మట్టి గాజులలో అత్యధిక శాతం ఇక్కడి నుంచే వస్తాయి. మట్టి గాజులు అత్యంత ప్రాచుర్యం పొందడమే కాక సాంప్రదాయకమైనవి. పండుగలు, శుభకార్యాలలో వీటికి ప్రాధాన్యత ఎక్కువ. తెలంగాణలోని హైదరాబాద్ చార్మినార్ పక్కనే ఉన్న లాడ్ బజార్ లాక్ (లక్క) గాజులకు ప్రపంచ ప్రసిద్ధి చెందింది. దీన్ని చుడీ బజార్ అంటారు. నిజాంల కాలం నాటి నుండి ఇక్కడ గాజుల తయారీ కొనసాగుతోంది. చేత్తో తయారు చేసే ఈ గాజులపై పొదిగే చమ్కీలు, రంగురాళ్ల కళాఖండాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.



రాజస్థాన్‌లోని జైపూర్, జోధ్‌పూర్ కూడా లక్కగాజులకు తయారీకి, కుందన్ వర్క్ గాజులకు చాలా ప్రసిద్ధి. ఇక్కడి సంప్రదాయ శైలిలో ఉండే బ్రైడల్ గాజుల సెట్లకు (చూడా) దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. పశ్చిమ బెంగాలీ సంప్రదాయంలో పెళ్లయిన స్త్రీలు ధరించే 'శాఖాపోలా' గాజులు ఇక్కడ ప్రత్యేకంగా తయారవుతాయి. 'శాఖా' అంటే తెల్లటి శంఖాలతో చేసే గాజులు. 'పోలా' అంటే ఎర్రటి కోరల్ (పగడం) లేదా ప్లాస్టిక్‌తో చేసే గాజులు, బెంగాలీ సంస్కృతిలో మట్టితో చేసే వస్తువులకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని 'విష్ణుపూర్' ప్రాంతం మట్టి కళాఖండాలకు ప్రపంచ ప్రసిద్ధి. ఇక్కడ స్త్రీలు ధరించే మట్టి గాజులు అత్యంత సహజంగా, రంగు రంగుల చిత్రకళతో కనిపిస్తాయి. ఇంకా గుజరాత్ గాజులకు ప్రత్యేకత ఉంది. ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో అనేక రకాల గాజులు లభ్యమౌతాయి. తెలుగు రాష్ట్రాలలో స్థానికంగా కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలుగా గాజుల అలంకరణ, ఫ్యాన్సీ గాజుల తయారీ జరుగుతుంది. ముఖ్యంగా రాయలసీమ, కోస్తా తీర ప్రాంతాల్లోని కొన్ని వర్గాల వారు సాంప్రదాయకంగా గాజుల వ్యాపారం, ఉత్పత్తిలో పాలుపంచుకుంటున్నారు.



స్త్రీల అలంకరణలో, సాంప్రదాయాలలో గాజులు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పదార్థాన్ని బట్టి, వాటిని తయారు చేసే విధానాన్ని బట్టి గాజులలో ఎన్నో రకాలు ఉన్నాయి. లాక్ గాజులను సహజసిద్ధమైన 'లాక్' (కీటకాల నుండి సేకరించే జిగురు వంటి పదార్థం)తో వీటిని తయారు చేస్తారు. వీటిని లక్క గాజులు అంటారు. వీటిపై రంగురాళ్లు, పూసలతో అద్భుతమైన డిజైన్లు చెక్కుతారు. మెటల్, రాగి గాజులను ఇత్తడి, రాగి, అల్యూమినియం వంటి లోహాలతో తయారవుతాయి. రోజువారీ వాడకానికి, ఫ్యాషన్ దుస్తులకు ఇవి బాగా సరిపోతాయి. చెక్క ప్లాస్టిక్ గాజులు ఆధునిక డిజైన్లతో, తక్కువ బరువుతో లభించే ఫ్యాన్సీ గాజుల రకాలు, శంఖం, సీ షెల్ గాజులు సముద్రపు శంఖాలతో తయారు చేసే తెల్లటి గాజులు. ముఖ్యంగా తూర్పు భారతదేశంలో వీటికి ప్రత్యేక సాంప్రదాయక ప్రాముఖ్యత ఉంది. ధనవంతులు డాబూ, దర్పం కోసం బంగారు గాజులు ధరించినప్పటికీ సంప్రదాయక రంగు రంగుల మట్టి గాజులు ధరించడానికి కూడా మక్కువ చూపుతారు. నిన్నటి తరం మట్టి గాజుల నుండి నేటి తరం ప్లాటినం, బంగారు, ఫ్యాన్సీ గాజుల వరకు రూపాలు మారినా గాజులపై స్త్రీలకున్న మమకారం అణుమాత్రం కూడా మారలేదు. నేటి ఆధునిక ప్రపంచంలో స్త్రీలు ఎన్ని శిఖరాలను అధిరోహిస్తున్నా, తమ సంప్రదాయ మూలాలను మరవకుండా గాజులను ధరించడం వారి ప్రత్యేకత.గాజుల గలగలలు కేవలం అందాన్ని మాత్రమే కాదు,భారతీయ స్త్రీల ఆత్మవిశ్వాసాన్ని, వారి సాంప్రదాయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నాయి. సౌభాగ్యానికి ప్రతీకగా, ఆరోగ్యానికి రక్షణగా, సౌందర్యానికి ఆభరణంగా నిలిచే గాజులు భారతీయ సంస్కృతిలో ఒక విడదీయరాని భాగం. చేతికి వేసుకునే గాజుల వెనుక ఒక శాస్త్రీయ కోణం, అంతకు మించిన ఒక భావోద్వేగ బంధం దాగి ఉన్నాయి. అందుకే ఈ గాజుల సవ్వడి ఉన్నంత కాలం భారతీయ సంప్రదాయం నవనవోన్మేషంగా వర్ధిల్లుతూనే ఉంటుంది.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**

వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్స్: 9885446501/9885449458



**సి.కౌశిక్, నిజామాబాద్**

**ప్రశ్న: నారి ప్రవాహ వేధ గురించి వివరించగలరు.**

**జవాబు:** 'నారము' అంటే నీరు అని అర్థం. ఒక గృహానికి/గ్రామానికి నీటి ప్రవాహం 1) వాయువ్యం నుండి ఈశాన్యానికి గానీ, 2) ఆగ్నేయం నుండి ఈశాన్యమునకు గానీ ఉండటం వాస్తు సమ్మతమైనది. ఈ విధంగా నీటి ప్రవాహాలున్న గృహానికి/ గ్రామానికి సత్ఫలితాలుంటాయని వివరించారు.

ఒక గృహానికి లేదా గ్రామానికి దక్షిణంలో ఆగ్నేయంలో నుండి నైరుతికి గానీ 3) నైరుతి నుండి ఆగ్నేయంనకు, 4) నది, కాలువ, బోదె మొదలైనవి ప్రవహిస్తున్నట్లయితే నారి(నీరు) ప్రవాహ వేధ దోషం సంభవిస్తుంది. అలాగే గృహానికి నైరుతి నుండి వాయువ్యమునకు గానీ, 5) వాయువ్యం నుండి నైరుతికి గానీ, 6) నీటి ప్రవాహాలున్న ఈ దోషం సంభవిస్తుంది. గృహానికి/ గ్రామానికి పశ్చిమంలో నైరుతి నుండి వాయువ్యంనకు, (7) ఉత్తరాన ఈశాన్యం నుండి వాయువ్యంనకు, (8) నీటి ప్రవాహాలున్నా ఈ దోషం ఈశాన్యం నుండి ఆగ్నేయమునకు గానీ ఇలాంటి ప్రవాహాలున్నా ఈ దోషాలు కలుగుతాయి. ఫలితాలు అన్ని గృహాలకు ఒకే తీరులో

# నారి ప్రవాహ వేద ఫలితాలు?



కలుగుతుంది.

'నారి ప్రవాహ వేధ' దోషం వలన మృత్యువు, వంశనాశనం మొదలైన తీవ్ర దుష్ఫలితాలుంటాయని వాస్తు గ్రంథాలలో పేర్కొన్నారు. అయితే పైన పేర్కొన్న ప్రభావాలలో కొన్ని మాత్రమే తీవ్రతరమైన దోషాలు, మరికొన్ని అంత తీవ్రమైనవి కాదు. ఉదా: నైరుతి నుండి వాయువ్యమున్న ప్రవాహాలు; నైరుతి నుండి ఆగ్నేయమునకు ఉన్న ప్రవాహాలు. భూమి(క్షేత్రం) ప్రకృతిసిద్ధంగా తూర్పు పల్లం లేదా ఉత్తర పల్లం అయినప్పుడు(3,5) ప్రవాహాలు ఏర్పడతాయి. అందువల్ల గృహానికి/ గ్రామానికి పశ్చిమ, దక్షిణ దిక్కులయందు ప్రవాహం ఉండటం దోషమైనా, ప్రవాహ గతి తూర్పు, ఉత్తర దిక్కులకు ఉండటం వల్ల తీవ్రమైన చెడు ఫలితాలను కలిగించవు.

గృహానికి లేదా న(గ్రామానికి (7) ఈశాన్యం నుండి వాయువ్యం నకు గానీ, (8) ఉండకపోవచ్చు. నీటి పరిమాణం, ప్రవాహగతి, గమనాలను బట్టి గృహానికి/గ్రామానికి ఉన్న దూరాన్ని బట్టి, చెడు ఫలితాల తీవ్రతలో హెచ్చుతగ్గులుంటాయి. గృహానికి/గ్రామానికి ఇవి అతి సమీపంలో ఉన్నప్పుడు దోష తీవ్ర పెరిగి చెడు ఫలితాలు కూడా తీవ్రంగా ఉంటాయి. గృహానికి, గ్రామానికీ ఈ ప్రవాహాలకు దూరం పెరుగుతున్నకొద్దీ ఈ దోషం సాంద్రత తగ్గుతూ ఉంటుంది. అలాగే చెడు ఫలితాల తీవ్రత కూడా తగ్గుతూ పోతుంది.


వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:

సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................

పుట్టిన తేది : ............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................

చిరునామా:..............................................


## కొత్త షట్టర్ల ఫ్లోరింగ్ ఎత్తుగా ఉండవచ్చా?

**ప్రశ్న: సుమారు పది సంవత్సరాల క్రితం 1,2 షట్టర్లు వేసాం. సంవత్సరం క్రితం షట్టరు 3, 4 వేసాం. 1,2 షట్టర్ల కంటే- 3,4 షట్టర్లు 1/2" ఫ్లోరింగ్ ఎత్తుగా ఉన్నాయి. దీని గురించి అనుమానంగా ఉన్నది. అలా ఉన్నా పరవాలేదా? లేక వాస్తు ప్రకారం ఏమైనా సరిచేయాలా?**

**జవాబు:** మీరు ఒకసారి కట్టినా, దఫదఫాలుగా కట్టినా సరే.. ఉత్తర, తూర్పు దిక్కులకు కట్టే షట్టర్లు లోపలి నేల మట్టం(ఫ్లోరు) కంటే దక్షిణ, పశ్చిమ దిక్కుల్లో కట్టే నేలమట్టం తప్పకుండా ఎంతో కొంత 'ఎత్తుగా' ఉండాలి.

ఈ నియమాన్ని దృష్టిలో పెట్టుకొని సవరించుకొని చూడండి. చాలా మంచి ఫలితాలను శీఘ్రంగా పొందగలుగుతారు.

# శ్రీ నరసింహుడు పాదం మోపిన క్షేత్రం

**లోకసంరక్షణార్థం త్రిమూర్తులలో ఒకరైన శ్రీమన్నారాయణుడు అనేక అవతారాలను ధరించారని పురాణాలు తెలుపుతున్నాయి. ఆ అవతారాలలో ముఖ్యమైనవి.. మనందరికీ తెలిసినవి మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణ, రాబోయే కల్కి. ఈ దశావతారాలలో అత్యంత ఉగ్రమైనది, భక్తవత్సలత చూపించి భక్తులను ఈతిబాధల నుండి కాపాడేది శ్రీ నరసింహ అవతారం.**

భారతదేశంలో ముఖ్యంగా దక్షిణాపథంలో శ్రీ నరసింహ ఆరాధన అధికం. ఎన్నో విశేష శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువైన క్షేత్రాలు నెలకొని ఉన్నాయి. శ్రీహరి ఉగ్రనరసింహ అవతారం ధరించడానికి సంబంధించిన పురాణ గాథ కృతయుగం నాటిదిగా విష్ణుపురాణం తెలుపుతోంది.

## జయ విజయులు

వైకుంఠ ద్వారపాలకులైన జయ విజయులు ఒకానొక సందర్భంలో తెలియని అహంకారంతో బ్రహ్మ మానస పుత్రులైన సనక సనందనాదులను అపహాస్యం చేసి వారి ఆగ్రహానికి లోనయ్యారు. వారిని వైకుంఠం వీడి భూలోకంలో జన్మించమని శపించారు మహర్షులు.

నిరంతరం శ్రీ మహావిష్ణు సేవలో గడిపే వీరికి దిక్కు తోచక స్వామిని శరణు కోరారు. వైకుంఠవాసుడు ముని శాపాన్ని తొలగించుకున్నా వారికి ఒక వెసులుబాటు తెలిపారు. శ్రీవారి భక్తులుగా ఏడు జన్మలు లేదా శత్రువులుగా, లోకకంటకులుగా మూడు జన్మలు ఎత్తిన తరువాత తిరిగి వైకుంఠానికి రావచ్చు.

వైకుంఠాన్ని, స్వామి సేవను ఎక్కువ కాలం వదిలి ఉండలేని జయ విజయులు శ్రీహరి శత్రువులుగా మూడు జన్మలు ఎత్తుతామని చెప్పారు. అలా వైకుంఠ ద్వారపాలకులు తొలి జన్మలో హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులుగా; రెండవ జన్మలో రావణ, కుంభకర్ణులుగా; మూడవ జన్మలో శిశుపాల, దంతవ్రక్తులుగా జన్మించి శ్రీవారి చేతిలో హతులైనారు.

శ్రీమన్నారాయణుడు హిరణ్యాక్షుని భూవరాహ అవతారంలో సంహరించారు. ఎంత వారించినప్పటికీ హరి నామస్మరణ మానని కుమారుడు ప్రహ్లాదుని అనేక చిత్రహింసలకు గురిచేశాడు హిరణ్యకశ్యపుడు. చివరికి అసురునికి ఉన్న వరం వలన స్థంభం నుండి నరసింహ రూపంలో ఉద్భవించి అంతం చేశారు. హిరణ్యకశ్యప వధ జరిగింది పావన అహోబిలంలో అని



చెబుతారు.

ఈ గాథతో ఈ అవతారంతో ముడిపడి ఉన్న క్షేత్రాలు మనకు ఎన్నో కనపడతాయి. అలాంటి దివ్య క్షేత్రాలలో ఒకటి అనంతపురం జిల్లా లోని 'శ్రీ మలహోబిలం'. జిల్లాలోనే చాలామందికి తెలియని విశిష్ట క్షేత్రం.

ప్రహ్లాదుని ప్రార్థన మేరకు వైకుంఠం నుండి భూమికి వచ్చే సమయంలో స్వామి తన పాదాన్ని ఈ క్షేత్రంలో మోపి అహోబిలం వెళ్ళారన్నది క్షేత్ర గాథ. దానికి నిదర్శనంగా గర్భాలయంలో గద్దె మీద పాద ముద్రని చూపిస్తారు. ప్రస్తుతం పురావస్తుశాఖ వారి ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయం సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించినట్లుగా చెబుతారు.

మరో విశేషం ఏమిటంటే పాతిక సంవత్సరాల క్రితం వరకు గర్భాలయంలో ఎలాంటి అర్చనామూర్తి ఉండేవారు కాదు. పాదానికే పూజలు చేసేవారు. రెండు వేల సంవత్సరంలో మూలవిరాట్టును ప్రతిష్టించారు.

## ఆలయ విశేషాలు

అనంతపురం నుండి కళ్యాణ దుర్గం వెళ్లే దారిలో వచ్చే పంపనూరు జిల్లాలో ప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రం. పంపనూరుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వై కొత్తపల్లి అనే గ్రామంలో చిన్న గుట్ట మీద నెలకొని ఉంటుంది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం. పర్వత పైభాగానికి రహదారి, మెట్ల మార్గం ఏర్పాటు చేశారు.

ఆలయానికి కొద్ది దూరంలో చిన్న గద్దె మీద స్థంభం నుండి వెలుపలికి వచ్చి ఒడిలో వేసుకొని హిరణ్యకశ్యపుని సంహరిస్తున్న శ్రీ నరసింహ స్వామి, ఎదురుగా అంజలి ఘటిస్తూ ప్రహ్లాదుని రూపాలు వర్ణమయ శోభితంగా జీవం ఉట్టిపడేలా తయారు చేసి నిలిపారు. కొద్దిగా ఎత్తైన ప్రదేశంలో ఉన్న ప్రధాన ఆలయానికి బయట ధ్వజస్థంభం, గరుడాళ్వార్ సన్నిధి, శ్రీ వైష్ణవ ఆచార్యుల విగ్రహాలను చూడవచ్చు.

ఆలయ ప్రాంగణంలో విశేష నిర్మాణాలు, శిల్పాలు కనపడవు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం మొదటి ఆలయం చాళుక్యుల కాలంలో నిర్మించినట్లుగా తెలియవస్తోంది. కానీ క్షేత్ర వైభవం పతాక స్థాయికి చేరింది మాత్రం విజయనగర పాలకుల కాలంలో అంటారు. ఆలయ ప్రస్తుత నిర్మాణశైలి కూడా విజయనగర విధానంలో ఉంటుంది.

రాజధాని హంపి నుండి ఇక్కడకు వచ్చి స్వామిని సేవించుకొనేవారట. విశ్రాంతి పెనుగొండ తదితర ప్రదేశాలకు తరలి వెళ్లేవారట. ఆలయం చుట్టూ సైనికులు విశ్రాంతి తీసుకోడానికి నిర్మించబడిన అనేక మండపాలను నేటికీ మనం చూడవచ్చు.

ఎత్తు తక్కువగా ఉండే ముఖ మండపం నుంచి గర్భాలయం వద్దకు వెళితే నయనమనోహరమైన అలంకరణలో ప్రశాంత రూపంలో దర్శనం ప్రసాదిస్తారు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి. మూలవిరాట్టు పీఠం పైన నేటికీ స్పష్టంగా స్వామివారి పాద ముద్ర కనిపిస్తుంది. నైరుతిలో కల్యాణ మండపం తప్ప మరో ఉపాలయం లేదా నిర్మాణం కనిపించవు.

అన్ని వైష్ణవ క్షేత్రాలలో లక్ష్మీనారాయణులు లేదా లక్ష్మీ నరసింహులు గర్భాలయంలో కొలువై ఉన్నప్పటికీ మరో సన్నిధిలో క్షేత్ర తాయారు దర్శనమిస్తారు. ఇక్కడ కూడా శ్రీ లక్ష్మీ అమ్మవారు ప్రధాన ఆలయానికి కొద్ది దూరంలో మరో ఆలయంలో ఉపస్థిత భంగిమలో ప్రసన్నవదనంతో అనుగ్రహిస్తారు.

ప్రతి నరసింహ క్షేత్రంలో సుదర్శన చక్రానికి అంజనాసుతుడు శ్రీ ఆంజనేయునికి సముచిత స్థానం ఇవ్వబడుతుంది. పైభాగాన ఉపాలయం లేకున్నా పర్వత పాదాల వద్ద రుద్రాంశ సంభూతుడైన శ్రీ హనుమంతుడు దక్షిణ ముఖంగా నిర్మించిన ఆలయంలో



కొలువై దర్శనం ప్రసాదిస్తారు. విగ్రహ స్వరూపాన్ని బట్టి చూస్తే విజయనగర కాలం నాటిదిగా తెలుస్తుంది.

శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా పర్వతాలకు అభిముఖంగా ఉపస్థితుడైన నందీశ్వరుడు కనిపిస్తారు. కానీ శివాలయం కనిపించదు. దూరంగా ఉన్న కొండలలో ఉన్న ఒక గుహలో లింగరాజు స్థిరమై ఉన్నారట. కానీ అక్కడికి చేరుకోవడం దుర్లభం అంటారు. గతంలో ఈ ప్రాంతంలో తపస్సు చేసిన వారి ఆదేశం మేరకు ఇక్కడ నంది ప్రతిష్ఠ జరిగినట్లుగా తెలుస్తోంది.

## ఆలయ పూజలు, ఉత్సవాలు

ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం పన్నెండు వరకు; తిరిగి సాయంత్రం అయిదు గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు తెరిచి ఉంచే ఆలయంలో నియమం ప్రకారం నిర్ణయించిన నిత్య పూజలు జరుపుతారు. శని, ఆదివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. శ్రీరామనవమి, శ్రీ హనుమజ్జయంతి, శ్రీకృష్ణ అష్టమి, శ్రీ నరసింహ జయంతి, వైకుంఠ ఏకాదశి, ఇతర హిందూ పర్వదినాలను వైభవంగా చేస్తారు. ప్రతి నెల శ్రీవారి జన్మ నక్షత్రం అయిన స్వాతిరోజున విశేష పూజలు జరుపుతారు. ప్రతి సంవత్సరం వార్షిక ఆలయ బ్రహ్మోత్సవాలను రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ జరిగే రథోత్సవం పెద్ద ఆకర్షణ. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక పక్కన ఉన్న కర్ణాటక నుండి కూడా భక్తులు తరలి వస్తారు.

ప్రతి గ్రామంలోనూ ఆలయాలు కనపిస్తాయి. ఇలా పల్లెలలో నెలకొని ఉన్న ఆలయాలు చాలా వరకు పురాతనమైనవి. కొన్ని ఈ క్షేత్రం మాదిరి విశేషమైనవి. గ్రామాలలో కనిపించే పురాతన ఆలయాల అభివృద్ధికి గ్రామస్థులు కృషి చేయవలసిన అవసరం ఉన్నది. మన పురాతన చరిత్రను కాపాడటానికి ప్రభుత్వం కూడా తమ వంతు సహకారం అందించవలసి ఉంటుంది.

## ఎలా వెళ్లాలి?

శ్రీ నరసింహ స్వామి పుడమి పైన తొలుత పాదం పుణ్య క్షేత్రం శ్రీ మలహోబిల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం అనంతపురానికి ఇరవై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రం పంపనూరుకు రెండు కిలోమీటర్లు. కళ్యాణదుర్గం, రాయదుర్గం వెళ్లే బస్సులు పంపనూరులో ఆగుతాయి. శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని సేవించుకొని ఆటోలో మలహోబిలం వెళ్ళవచ్చు. ఇక్కడ ఎలాంటి వసతి భోజన సౌకర్యాలు లభించవు. అనంతపురంలో లభిస్తాయి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

> లార్డ్ మెకాలే ఒక వాక్యం రాయడానికి ఇరవై పుస్తకాలు చదివేవాడు. ఒక వర్ణన చేయడానికి వంద మైళ్ళు ప్రయాణించేవాడు.
> - థాకరే
>
> విదూషకుడు క్రియాశీల కవి వంటివాడు. - హెన్రీ మిల్లర్

# వందేళ్ళనాటి ఒద్దిరాజు వారి ఆఖ్యాయిక

# 'రాణి రుద్రమ'

“నా చే రచియింపబడిన ఈ రుద్రమదేవి అను ఆఖ్యాయికకు సంబంధించిన పాత్రలను, కథను “ఆంధ్రుల చరిత్రము, హిందూ దేశ కథా సంగ్రహము”ల నుండి గైకొన్నానని, 1918 నాటి మొదటి కూర్పు పీఠికలో గ్రంథ ప్రమాత ఒద్దిరాజు సీతారామచంద్రరాయ శర్మ అన్నారు. గ్రాంథిక శైలిలో నడిచిన ఈ తొలి తొలుత నవలకు కొమర్రాజు లక్ష్మణరావు నడిపే విజ్ఞాన చంద్రికామండలి స్వర్ణ పతకాన్ని బహూకరించారు. 1910 దశకంలో ఒద్దిరాజు వారు రచించిన 'రుద్రమదేవి', తర్వాతనే నోరి నరసింహశాస్త్రి, అడవి బాపిరాజుల చారిత్రక నవలలు వచ్చాయి. ఒద్దిరాజు సోదరుల చారిత్రక పరిశోధనా శక్తి, వరంగల్ జిల్లాలో వారి స్వగ్రామం ఇనుగుర్తి పరిసరాలలో లభించిన శిలాశాసనాలు జనశ్రుతి ఆధారంగా ఈ నవల సృష్టించబడింది.

నిరుపమాన శౌర్యప్రతాపులని విఖ్యాతి చెందిన సుప్రసిద్ధ ఆంధ్రుల చరిత్రలు రాసి తెలుగుకు సేవ చేయాలని భాషా సేవకునిగా రచయిత ఒద్దిరాజు సీతారామచంద్ర రాయ శర్మ మొదటి కూర్పు పీఠికలో రాసారు. తల్లిదండ్రులు రంగనాయిక, వేంకట రామరాయలకు ఈ రచన అంకితం యిచ్చారు.

ఉర్దూ రాజభాషగా రాజ్యాధిపత్యం నెలకొని వున్న ఆ రోజులలో స్వగ్రామమైన ఇనుగుర్తిలో విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల స్థాపించి తెలుగులో గ్రంథ రచనలే కాకుండా ప్రచురణలు చేపట్టడం ఎంతో సాహసం, ఆర్థిక భారంతో కూడిన సేవా కార్యక్రమం. దేశభక్తిని ప్రేరేపించే గ్రంథాలు నెలలో ఒకటయినా ప్రచురించాలని, ఒద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు నాటి నైజాం రాష్ట్ర స్థితిగతులలో సంకల్పించి కొనసాగించి తెలంగాణ సాహితీ సాంస్కృతిక ఆవిర్భావానికి వైతాళికులుగా ఖ్యాతి పొందారు.

ఒద్దిరాజు సోదరుల కాలం నాటికి ముద్రణా సౌకర్యం లేదు. రుద్రమదేవి నవల బెజవాడలో అచ్చయింది. అప్పటికి తెలుగులో వ్యవహారిక భాషా ఉద్యమం లేదు. రుద్రమదేవి నగ్రంథం అందువలన కందుకూరి, చిన్నయసూరి భాషా సంప్రదాయంలో గ్రాంథిక భాషలోనే నడిచింది. ఒద్దిరాజు సోదరుల సత్కృషికి, అక్కినేపల్లి జానకి రామారావు జాగీర్దార్ అండదండలు లభించాయి. విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాలకు వారే సంపాదకులుగా వ్యవహరించారు.




ఒద్దిరాజు వారి రుద్రమదేవి చరిత్రాంశాలలో రచయితకున్న శ్రద్ధాసక్తులకు, కథానాయిక వీరనారి రుద్రమదేవి నిరుపమాన శౌర్య ప్రతాప కాకతీయ రాజన్యుల పట్ల వున్న మహత్వ ప్రగాఢ శక్తి నిదర్శనం. పురుషాధిక్యత సుప్రతిష్టంగా వున్న ఆ రోజులలో, రుద్రమ అధికారాన్ని అంగీకరించే సౌజన్యం లేదు.

ఆమెపై కుట్రలు పన్ని ఆమెను సంహరించే ప్రయత్నం ఏ విధంగా విఫలమైనదీ రచయిత అపరాధ పరిశోధనాత్మక దృష్టితో కథను, ఆ సంఘటనలను వివరించారు. దేవగిరి యాదవ దేవ మహరాజు, రుద్రమ సామ్రాజ్యాన్ని కబళించాలని ఆమెను సంహరించాలని పన్నిన కుట్ర విఫలత్వాన్ని, వీరనారి రుద్రమ ఘోర సంగ్రామ విజేతగా, శత్రువులను తరిమికొట్టి, ఆమె ముందు మోకరింపచేసిన విజయగాథ ఈ గ్రంథం వివరిస్తుంది.

ఈ నవలలో ఒద్దిరాజు వారి రచనా శైలి, కథా కథన విధానం, సన్నివేశ చిత్రీకరణ, పాత్రల రూపకల్పన చదివింపచేస్తుంది. కాకతీయుల కాలంలోని భాష, వాడుక పద్ధతులు, జీవనశైలి, విభిన్న కోణాలలో నాయకురాలి వ్యక్తీకరణ, యుద్ధ పరాక్రమ తీరుతెన్నులు, ఆదర్శ భావాల పాలన ఎన్నో మౌలికాంశాలను ఒద్దిరాజువారు కళ్ళకు కట్టించారు. రుద్రమ పరిపాలనా దక్షత, జన సామాన్యం పట్ల ఆదరణ, వీర సైనికులకు జీతభత్యాలు, కరుణ, రసాత్మక హృదయ వైఖరి ఈ నవల స్పష్టం చేస్తుంది. 13వ శతాబ్ద చారిత్రక గాథ ప్రస్తుత 21వ శతాబ్దంలో పునర్ముద్రణ కూడా పొందే చారిత్రక ప్రాధాన్యత ఈ నవల పొందటం ఒద్దిరాజు వారి ప్రతిభా సంపన్నతకు తార్కాణం.

సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు అపూర్వ సోదరుల అద్వితీయ ప్రతిభా సంపన్నత గురించి ప్రముఖ రచయిత్రి కొండపల్లి నీహారిణి “కథలు చదివితే వ్యథలు తెలియాలి. చరిత్ర చదివితే సత్యాలు తెలియాలి. కాకతీయ సామ్రాజ్య చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకున్న ఒద్దిరాజు వారు, చారిత్రక సంఘటనలకు ఆత్మను జోడించి, మార్గానుసరణను ప్రస్ఫుటిస్తూ, సన్నివేశ కల్పనా వైచిత్రితో రుద్రమదేవిగా తరతరాల ఆదర్శ వనిత, వీరనారి రుద్రమదేవిని మహిళా శక్తి, సాధికారతకు నిలువుటద్దంలా సృష్టించారు” అంటారు ఈ గ్రంథ పునర్ముద్రణ తొలిపలుకులలో.

– జయసూర్య

## 7 జూన్, 2026 నుండి 13 జూన్, 2026 వరకు



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం కుటుంబ సమస్యలు, బంధువులతో తగాదాలు తప్పక పోవచ్చు. ఆర్థికంగా కొంత ఒడిదుడుకులు ఉంటాయి. ఋణాలు కూడా అధికంగా చేస్తారు. సోదరులు, మిత్రుల నుండి అందిన లేఖ ద్వారా ఆసక్తికరమైన సమాచారాన్ని తెలుసుకుంటారు. అంతర్గత శత్రువులు పెరుగుతారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉన్నా మధ్యమధ్యలో ఆటంకాలు ఎదురవుతాయి.

### వృషభం

ఈ వారం పెట్టుబడులకు తగిన లాభాలను పొందుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. విద్య, ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి. గృహం, వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతుల సూచన. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. జీవితభాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. రాజకీయ కళారంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది.

### మిథునం

ఈ వారం ఆరోగ్య సమస్యలు తీరి మానసిక ప్రశాంతత పొందుతారు. అనుకోని విధంగా డబ్బు అందుతుంది. భూమి లేదా గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు. కుటుంబంలో సమస్యలు మాత్రం తప్పవు. సోదరుల నుండి కొంత వ్యతిరేకత ఎదురవుతుంది. కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్థిరాస్థి వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి, వ్యాపారాలలో మంచి ప్రగతిని సాధిస్తారు. ప్రయాణాలలో కొత్త మిత్రులు పరిచయమవుతారు.

### కర్కాటకం

ఈ వారం పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఎంతో సన్నిహితంగా ఉన్న వారు మీకు విరుద్ధంగా మారి మిమ్మల్ని నిందారోపణలకు గురి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంక్రిమెంట్లు లభిస్తాయి.నిత్యం తెల్లజిల్లేడు వినాయకునికి పూజించాలి.

### సింహం

ఈ వారం ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. బంధువులతో ఏర్పడిన వివాదాలు తీరి ఊరట చెందుతారు. వాహనాలు, గృహం, కొనుగోలు యత్నాలు చేస్తారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. ముఖ్యమైన విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. కోర్టు, కేసుల నుండి బయటపడతారు. సన్నిహితుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

### కన్య

ఈ వారం ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిదానంగా అడుగులు వేయడం మంచిది. పలు రంగాలపట్ల మీకున్న అనుభవం ఉపకరిస్తుంది. వెనువెంటనే పూర్తవుతాయి అనుకున్న పనులు వాయిదా పద్ధతులలో సాగుతాయి. "కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం" అన్నచందంగా ఎవరికీ సర్ది చెప్పలేని పరిస్థితి నెలకొంటుంది. దైవం మీద భారం వేసి ఒక కీలక నిర్ణయాన్ని అమలు పరుస్తారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

### తుల

ఈ వారం ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు తప్పవు. ప్రయత్నాలు ముందుకు సాగవు. నిత్యం శక్తి కంకణం ధరించడం అన్నివిధాలా మంచిది. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. బంధువుల నుండి శుభవార్తలు వింటారు. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరవుతారు. భూ వివాదాలు పరిష్కారమవుతాయి. సభలు, సమావేశాలలో చురుగ్గా పాల్గొంటారు.

### వృశ్చికం

ఈ వారం ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. నూతన ఒప్పందాలు కలిసి వస్తాయి. దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఎదురుచూడని అవకాశాలు లాభిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. కోపతాపాలకు దూరంగా వుండడం మంచిది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

### ధనస్సు

ఈ వారం కీడెంచి మేలెంచమన్న విధంగా ఆలోచనా శైలి ఉంటుంది. పాత సమస్యలు కొత్త కోణంలో తారసపడతాయి. ఆరోగ్యం నలతగా ఉంటుంది. వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా కొత్త విశేషాలేవీ చోటు చేసుకోవు. జమాఖర్చులను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటారు. నేర్పుగా ఆర్థిక సర్దుబాట్లను చేసుకోగలుగుతారు. స్త్రీలతో విభేదాలు ఏర్పడే సూచనలున్నాయి. పుకార్లు ప్రచారంలో ఉంటాయి. వ్యక్తిగత హోదాకు మాత్రం మచ్చ ఏర్పడదు. నిత్యం కనకధారాస్తోత్రం పఠించండి.

### మకరం

ఈ వారం అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. అయితే ఇది తాత్కాలికమైనవి అయివుంటాయి. ఊహాజనితమైన మాటలతో మిమ్మల్ని నమ్మించడం కష్టతరమని ఇతరులు తెలుసుకోగలుగుతారు. ఉన్నతాధికారులు మీ శ్రమను గుర్తిస్తారు. తనఖావస్తువులను విడిపించుకోగలుగుతారు. కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి. నరదృష్టి అధికంగా ఉంటుంది. సెల్ఫ్ డ్రైవింగ్లో జాగ్రత్తలు అవసరం. నిత్యం సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పూజించండి.

### కుంభం

ఈ వారం న్యాయబద్ధమైన మీ వాదనలకు గాను అధికారుల అండదండలు లభిస్తాయి. సహోదర, సహోదరీ వర్గంతో భేదాభిప్రాయాలను గ్రహస్థితి సూచిస్తోంది. వ్యాపార పరంగా లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. రాజకీయ రంగంలోని వారికి నూతన మార్పులు గోచరిస్తున్నాయి. మిత్రులు చెప్పిన హితవును పాటిస్తారు. శుభవార్తా శ్రవణం చేస్తారు. నిత్యం ఇష్టదేవతాసన్నిధిలో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.


### మీనం

ఈ వారం ప్రజాసంబంధాలు మెరుగుపడతాయి. వైరివర్గంతో తాత్కాలిక ఒప్పందం కుదురుతుంది. దూరప్రాంత ప్రయాణాలు రద్దు చేసుకుంటారు. అధికారులు, రాజకీయ నాయకులతో విసుగూ, విరామం లేని చర్చలు సాంఘీక అసమానతలపై మీ పోరాటం ఫలిస్తుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. మీ మంచితనమే పెట్టుబడిగా విజయాలు సాధిస్తారు. ఆరోగ్యమును గురించి-వైద్యుని సంప్రదించవలసి వస్తుంది.

# ఈ వారం కార్టూన్స్


హల్లో ED..! ఇతను పేదాందలు వేసి తిరిగి UPI చేయుమంటున్నాడు.. పక్కా మనీ లాండరింగ్!!
Zakir...


మన రెండు ఫోన్లకు పెళ్ళి చేస్తే మనకు సంతానం కల్గుతుందటండీ! యూట్యూబ్ లో ఉంది!!


నా పని మీదనా? మీ పని మీదనా వచ్చింది?!
మీ పని మీదైతే వంటా, అదే మీకే చెప్పాలి!!
చుట్టం







ఒక్కో బీచ్‌కు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. గ్రీస్‌లోని అమౌడీ బీచ్‌కు వెళ్లాలంటే సుమారు మూడు వందల మెట్లు కిందికి దిగి వెళ్లాలి. అదీ దీని ప్రత్యేకత. సంధ్యా సమయంలో ఇక్కడ పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది.

